



కర్నూలు మార్కెట్ యార్డులో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

అమ్ముకునోడికి అమ్ముకున్నంత

- ఏరులై పారుతున్న కర్ణాటక మద్యం - అమ్మకాల వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం - మామూళ్ల మత్తులో అధికారులు

ప్రజాశక్తి - కోసిగి రూరల్

'మా ప్రభుత్వం రాగానే మద్యాన్ని పూర్తిగా నిషేధిస్తాం..' ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు పాదయాత్రలో జగన్మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. మద్యాన్ని పూర్తిగా నిషేధించకపోగా మద్యం అమ్మకాలు ఓ వైపు పెంచుకుంటుంటే మరో వైపు అక్రమ మద్యం ఏరులై పారుతోంది. అమ్మకాల వెనుక అధికార పార్టీ నాయకుల హస్తం ఉంటోంది. దానికి తోడు అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోవడంతో కర్ణాటక మద్యం అమ్ముకున్నోడికి అమ్ముకున్నంతలా తయారయిపోయింది...

జిల్లాలో కర్ణాటక మద్యం ఏరులై పారుతోంది. కోసిగి మండలంలో ఎక్కడబడితే అక్కడ ఏ గ్రామంలో చూసినా ఐదు నుంచి పది దాకా విచ్చలవిడిగా బెల్ట్ షాపుల్లో కర్ణాటక మద్యం అమ్ముతున్నారు. తుంగభద్ర నదీ తీర గ్రామాలను దాటిన వెంటనే ఉండటంతో కోసిగి మండలంలో కర్ణాటక మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. రాత్రికి రాత్రే నదిని దాటి సునాయాసంగా మండలంలోని గ్రామాలకు చేరవేస్తున్నారు. సంచుల్లో తెచ్చుకుని ఇళ్లలో, అంగళ్లలో పెట్టుకుని విచ్చలవిడిగా అమ్ముతున్నారు. ఉన్న ధరల కంటే రెట్టింపు ధరలకు అమ్ముతూ అక్రమ మద్యం అమ్మకందారులు సొమ్ము చేసుకుంటున్నారు. 90 మిల్లీలీటర్ల టెట్రాప్యాక్ కర్ణాటక మద్యం ధర రూ.35 ఉండగా కోసిగి మండలంలో రూ.70కు విక్రయిస్తున్నారు. క్వాటర్ కర్ణాటక మద్యం ధర రూ.80 ఉండగా రూ.150 నుంచి రూ.170కి అమ్ముకుంటున్నారు. మండలం కేంద్రంలోని ప్రతి వీధిలో కర్ణాటక మద్యం అమ్మకాలు సాగుతున్నాయి. కోసిగి మండలంలోని నదీతీర గ్రామాలైన కందుకూరు, సాతనూరు, అగసనూరు నుండి రాత్రికి రాత్రి నదిని దాటుకొని ఇతర ప్రాంతాలకు అక్రమ మద్యాన్ని అందజేస్తున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వ మద్యం దుకాణాల వ్యాపారంపైనే ఆధారపడిన గ్రామీణ బెల్టు నిర్వాహకులు ఏకంగా కర్ణాటక చీప్ లిక్కర్ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ప్రభుత్వ నియంత్రణ అంతంతమాత్రంగానే ఉండడంతో గ్రామాల్లో కర్ణాటక లిక్కర్ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. నియోజకవర్గ సరిహద్దుల్లో నదీ తీర ప్రాంతాల్లో ఉన్న కర్ణాటక ప్రాంతాల నుంచి కుప్పలు తెప్పలుగా చీప్ లిక్కర్ రాత్రికి రాత్రే సరఫరా అవుతోంది. అధికారులు తూతూమంత్రంగా దాడులు నిర్వహిస్తున్నా వారి దగ్గర నుంచి మామూళ్లు తీసుకొని వారిని వదిలేసిన దాఖలాలు మెండుగా ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. సివిల్ పోలీసులు కూడా దాడులపై ఆసక్తి కనబరచడం లేదనే వాదన వినిపిస్తోంది. సెబ్, సివిల్ పోలీసుల మధ్య సమన్వయం కూడా అంతగా ఉండకపోవడంతో కర్ణాటక లిక్కర్ వ్యాపారం నిర్వహించే వారికి చక్కటి అవకాశాలు అందివచ్చినట్లు తెలుస్తోంది. యువత కర్ణాటక మద్యానికి అలవాటు పడి ఆరోగ్యాన్ని నాశనం చేసుకొని పెడదోవ పట్టే అవకాశం మెండుగా కనిపిస్తోంది. జిల్లా పోలీసు అధికార యంత్రాంగం మాత్రం కర్ణాటక మద్యాన్ని అరికట్టి ప్రత్యేక నిఘా ఉంచుతామని పదేపదే చెబుతున్నప్పటికీ దాన్ని తీసుకురావడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. కర్ణాటక మద్యం అమ్మకాల వెనుక అధికార పార్టీ నాయకులు హస్తం ఉందని, అందుకే పోలీసులు పట్టించుకోవడం లేదని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.



'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

- కర్నూలు మార్కెట్ యార్డులో ప్రచారం

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

సిఐటియు, ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో ఏప్రిల్ 5న జరుగు చలో ఢిల్లీ కార్యాక్రమాన్ని జయప్రదం చేయాలని మార్కెట్ యార్డులోని యూనియన్ నాయకులు వెంకటేశులు, రామకృష్ణ, పరుశురాం, మనోహర్, నాగరాజు, మద్దిలేటి, నాయకత్వంలో ప్రచార కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, యూనియన్ గౌరవ అధ్యక్షులు టి.రాముడు, సిఐటియు నగరఅధ్యక్ష్య, కార్యదర్శులు నరసిములు, సాయిబాబ మాట్లాడారు. దేశంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26,000 ఇవ్వాలని, రైతు లకు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, రాష్ట్రంలో ప్రాజెక్టులను చేపట్టాలని, నష్టపోయిన పంటలకు నష్టపరిహారం ఇచ్చి, ఇన్సూ రెన్స్ కల్పించాలని, గ్రామీణ వ్యవసాయ కార్మికుల ఉపాధి రక్షణ కనీస వేతనం రూ.600 ఇవ్వాలని,200 రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను అందరికీ అందుబాటులోకి తేవాలని, నిత్యవసర సరుకులు సరఫరా చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని, కోట్ల సంఖ్యలో ఉన్న హమాలీల లాంటి అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి దాని ద్వారా సంక్షేమ పథకాల అమలు చేసి, రూ.5000 పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఇలాంటి సమస్యలపై ఏప్రిల్ 5న ఢిల్లీలో మహాధర్మా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు, హమాలీలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక బోధన...

- వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- విజయ దీపిక పుస్తకాలు అందజేత
- నైట్ విజన్ కార్యక్రమానికి శ్రీకారం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అనేక చర్యలు చేపట్టింది. ఈ చర్యల్లో భాగంగా వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అలాంటి వారందరినీ మరింత మెరుగుపరిచి సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులచే శిక్షణ తరగతులను చేపడుతున్నారు. కర్నూలు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో ఈ ఏడాది 100శాతం ఉత్తీర్ణత సాధించేలా జిల్లా జిల్లా కలెక్టర్ పి కోటేశ్వరరావు చర్యలు చేపట్టారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు ఏ సబ్జెక్టులో అయితే వెనుకబడి ఉన్నారో వాటిలో మరింత తర్ఫీదు ఇచ్చేందుకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా సాయంకాలం నైట్ విజన్ కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టారు. జిల్లాలోని కర్నూలు ఆదోని పత్తికొండ మూడు రెవెన్యూ డివిజన్లకు ప్రత్యేక అధికారులను కూడా నియమించారు. ఈ మూడు డివిజన్లో పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపు కు నిరంతరం అక్కడ ఉన్న విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా ఉదయం సాయంకాలం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా శిక్షణ తరగతులను సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయులతో ఇస్తున్నారు. ఏ సబ్జెక్టులైతే బి, సి, డి గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి మరింత అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టారు. నైట్ విజన్ కార్యక్రమంలో భాగంగా రాత్రి వేళల్లో విద్యార్థుల తల్లిదండ్రులచే సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులు ఉత్తీర్ణత శాతం పెంపునకు సహకరించాలని విన్నవిస్తున్నారు. ప్రభుత్వ సెలవు దినాలతో పాటు ఆదివారం ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులకు సబ్జెక్టులలో ఉన్నటువంటి సందేహాలను ఉపాధ్యాయులచే నివృత్తి చేస్తున్నారు. విద్యార్థులకు ప్రత్యేకంగా సబ్జెక్టు నిపుణుల తయారుచేసి విజయ దీపిక పుస్తకాలను కూడా వారికి అందజేశారు. ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- సామ్యూల్ పాల్, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

పదవ తరగతిలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఏ సబ్జెక్టులో అయితే విద్యార్థులు వెనుకంజలో నిలిచారు. సంబంధిత సబ్జెక్టు ఉపాధ్యాయుల ద్వారా శిక్షణ ఇస్తున్నాం. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించడమే తమ లక్ష్యం.



ప్రత్యేక శిక్షణ తరగతులను పర్యవేక్షిస్తున్న విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్

స్వపక్షమే విపక్షమై...

- జిల్లా పరిషత్‌లో సభ్యుల ప్రశ్నల వర్షం
- మాకీ పదవులెందుకు ఆగ్రహించిన మహిళా సభ్యులు
- సమస్యలు పరిష్కరిస్తారా లేదా?
- నిలబడి నిరసన తెలిపిన జడ్‌పిటిసిలు

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లాపరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారపార్టీ సభ్యులే ప్రతిపక్షం సభ్యులకంటే ఘాటైన ప్రశ్నలతో ఉన్నతాధికారులను, మంత్రులను ఉక్కిరిబిక్కిరి చేశారు. ఎన్నిసార్లు సమస్యలు చెప్పాలి. పనులు చేస్తారా లేదా అని సభ్యులు సభలో నిలబడి నిరసన తెలిపారు. బుధవారం కర్నూలు ఉమ్మడి జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యం, భూగర్భ జలాలు, గృహ నిర్మాణం, పశు సంవర్ధక శాఖల అధికారులు నివేదికలు ప్రవేశ పెట్టారు.

మాకీ పదవులెందుకు ? ఆగ్రహించిన మహిళ సభ్యులు

మహిళలుగా రిజర్వేషన్ ఇచ్చారు తప్ప ఎలాంటి హక్కులు మాకు లేవు.. ఎందుకు ఈ పదవులు మండలానికి ఎంత బడ్జెట్ వస్తుంది. ఏమి పనులు జరుగుతున్నాయి. ఎలాంటి అభివృద్ధి చేయాలి. కనీసం సమాచారాన్ని, నివేదికల గురించి నేటికి కూడా మాకు తెలీదు. అధికారులు వచ్చి సంతకాలు పెట్టించుకోవడం, మీరు పిలిస్తే ఇక్కడకు వచ్చి వెళ్లడం తప్ప కనీసం మండల కేంద్రాల్లో ఒక రూమ్, కూర్చోవడానికి కనీసం కుర్చీ లేని పదవులు ఎందుకు అని కృష్ణగిరి జడ్‌పిటిసి కెఇ. సుభాషిణి, కోసిగి జడ్‌పిటిసి పవిత్ర పాటిల్ ఆగ్రహించారు. మహిళలకు కనీస గౌరవాన్ని ఇవ్వడం లేదని ఇలాంటి పదవుల్లో ఎందుకుండాలని ఆవేదన వ్యక్తం చేశారు. చైర్మన్ పాపిరెడ్డి కలుగజేసుకుని కచ్చితంగా ప్రతి నిర్ణయాన్ని మీ దృష్టికి వచ్చేలా చూస్తాం. మీకూ హక్కులు ఉండేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎన్నిసార్లు మీ దృష్టికి తీసుకురావాలి? చేస్తారా చేయరా ? : సి.బెళగల్ ఎంపిపి

సి బెళగల్ మండల కేంద్రంలో తుంగభద్ర నది నుండి నిరంతరం ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు తిరగడం వల్ల రహదారులన్నీ పెద్ద పెద్ద గోతులతో బావులను తలపించేలా ఉన్నాయి. ఇప్పటికి నాలుగు సమావేశాల్లో జడ్‌పి సమావేశంలో దష్టికి తీసుకొచ్చాను. కనీసం ఒక్కసారి అయిన కలెక్టర్ ,జిల్లా అధికారులు ఎమ్మెల్యేలు మంత్రులు వచ్చారా? కనీసం ఆ సమస్య గురించి తెలుసుకున్నారా ?ఇలాంటి ప్రభుత్వం ఎందుకు?. అధికార పార్టీ అంటే మమకారంతో ఏమి అనలేకున్నాను. ఇంతటి దౌర్భాగ్యం ఇంకేముంది. ఇలాంటి అధికారులు జిల్లా కలెక్టర్లు ఉన్నారు. ఒక్క సమస్యను పరిస్కారం చేయలేని అధికారులు ఎందుకు అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంకా ఎవరెవరేమన్నారు....

– జర్నలిస్టులకు జగన్నాథ గట్టు ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆ ప్రాంతంలో ఎర్రమట్టి తరలించేవారు. అక్రమంగా తరలిస్తున్నారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్సీ కత్తి నరసింహా రెడ్డి ప్రశ్నించారు. 2100 డిడి కట్టిన పేదలకు రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నప్పుడు కట్టిన అమౌంట్ కు ఎలాంటి న్యాయం చేస్తారో తెలపాలని, పాణ్యం నియోజకవర్గంలో 89 వర్కులు బిల్స్ ఇప్పటికి రాలేదని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ప్రశ్నించారు. జడ్‌పి సర్వ సభ్య సమావేశానికి హాజరయ్యే జెడ్పిటిసిలు, ఎంపిపి లకు ప్రజాప్రతినిధులకు నివేదికలు తయారు చేసినవి ముందుగా అందజేయాలని అందరూ చదువుకుని ఏమి మాట్లాడాలో తెలుస్తుందని కాటసాని రామిరెడ్డి సూచించారు. గూడెలలో చెంచులకు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్స్ త్వరగా మంజూరు చేయాలని నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ ప్రశ్నించారు. హార్టికల్చర్ అధికారులు రైతుల పేర్లు నమోదు చేయడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని కెసి కెనాల్ కు నీళ్లు నిలిపివేశారని ఏప్రిల్ 15 దాకా ఇస్తామని ఎందుకు నిలిపివేశారని గంగుల ప్రభాకర్ రెడ్డి ప్రశ్నించారు. ఉల్చాల రోడ్ కొత్తగా నిర్మాణం చెప్పట్టారు. మళ్ళీ ఆ దారిలో టిప్పర్లు తిరిగి మళ్ళీ గుంతల మయం చేశాయని ఎంపిపి వెంకటేశ్వరమ్మ అన్నారు. మిడ్తూర్ మండలంలో గన్ని బ్యాగ్స్ ఒక లక్ష నలభై వేల సంచులు దొంగలించారని, దాదాపు రూ.కోటికి పైగా నష్టం జరిగిందని ఒక కింది స్థాయి ఉద్యోగి ఆత్మహత్య చేసుకుని ప్రాణాలు పోగొట్టుకున్నారని మిడ్తూర్ జడ్‌పిటిసి యుగంధర్ రెడ్డి సభ దృష్టికి తెచ్చారు. ఉలిందకొండ చెరువు పై మట్టి టిప్పర్లు తిరిగి చెరువు దారి కృంగిపోతుందని కల్లూరు జెడ్పిటిసి తెలిపారు. ఇంత పెద్ద సమావేశంలో సభ్యులకు కనీసం నాలుగు మైకులు కూడా లేకుండా పెట్టారు. అధికారులకు సభ్యులకు రెండే మైకులు పెట్టారు. ఈ సారి నుండయినా మైకులు పెంచాలని కృష్ణగిరి జడ్‌పిటిసి కెఇ సుభాషిణి సూచించారు. నందికొట్కూరు పశువుల డాక్టర్ అందుబాటులో ఉండరని ఎప్పుడూ సెలవులో ఉంటారని ఆయన పని విధానం బాగాలేదని నందికొట్కూరు ఎంపిపి తెలిపారు. వచ్చిన ప్రశ్నలకు కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ మాట్లాడుతూ జడ్‌పిసిలు, ఎంపిపి లు అడిగిన ప్రశ్నలకు వెంటనే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మార్చి చివరికి ఎమ్మెల్సీ పదవుల గడువు ముగిసిన సందర్భంగా ఎమ్మెల్సీ కత్తి నరసింహ రెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి ,వెన్నపూస గోపాల్ రెడ్డిలను సన్మానించారు. సర్వ సభ్య సమావేశంలో వాల్మీకి, బోయ కులాలను ఎస్టీలుగా, క్రైస్తవ కులాల వారిని ఎస్సి లుగా అసెంబ్లీ ఆమోదం తెలపడాన్ని బలపరిచారు. విశాఖ లో పెట్టుబడులు పెట్టిన 351 ఒప్పందాల స్వీకరాన్ని ఆమోదించారు. ఇక్కడ చేసిన చర్యలను వెంటనే అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, మున్సిపల్ కమిషనర్ భార్గవ తేజ, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి, డిప్యూటీ సిఇఒ వెంకట సుబ్బారెడ్డి, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు ,జిల్లా అధికారులు, తదితరులు హాజరయ్యారు.



జిల్లా పరిషత్ సమావేశంలో నిరసన తెలుపుతున్న జడ్‌పిటిసిలు, ఎంపిపిలు



కార్యకర్త భౌతిక కాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళ్లు అర్పస్తున్న హఫీజ్‌ఖాన్

వైసిపి కార్యకర్త మృతికి హఫీజ్ ఖాన్ సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరం బుధవారపేటకు చెందిన మాధవరపు జస్వంత్ అలియాస్ బన్నీ మృతి పార్టీకి తీరని లోటని కర్నూలు ఎమ్మెల్యే ఎం.ఎ.హఫీస్ ఖాన్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే మృతుని ఇంటి వద్ద నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు మాధవరపు కేదార్నాథ్, నాయకులు కార్యకర్తలతో కలిసి ఆయన జశ్వంత్ భౌతిక కాయానికి నివాళు లర్పించారు. మతుని కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు. జశ్వంత్ రోడ్డు ప్రమాదంలో మంగళవారం మతి చెందాడని, ఈ విషయం తనను కలచివేసిందని అన్నారు. మంచి తనానికి మారుపేరుగా, కల్మషం ఎరుగని మంచి మనసుతో, ఆప్యాయత, అనురాగాలతో ఎల్లప్పుడూ నవ్వుతూ ఎదుటివారి మొహంలో చిరునవ్వులు పూయిస్తూ ఉండేవాడని అన్నారు. మతుని కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని తెలిపారు.

పత్తికొండలో సైకో హల్‌చల్

ఒక బస్సు ,రెండు కార్లు అద్దాలు ధ్వంసం

ప్రజాశక్తి-పత్తికొండ : నడిరోడ్డుపై సైకో వీరంగం చేసి ప్రజలను వాహనదారులను ఆందోళనకు గురి చేసిన సంఘటన పత్తికొండలో చోటుచేసుకుంది. బుధవారం పోలీస్ స్టేషన్ ముందు పత్తికొండ నుండి కర్నూలుకు వెళ్తున్న బస్సును ఆపి సైకో కండక్టర్‌తో వాగ్వాదం చేశాడు. కండక్టర్ సైకో పై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళ్తున్నాడని అతనిపై దాడి చేశాడు. పక్కనే ఉన్న ఇనుపు రాడ్డును తీసుకొని బస్సును పక్కనే ఉన్న రెండు కార్ల అద్దాలను పూర్తిగా ధ్వంసం చేశాడు. పోలీస్ స్టేషన్‌లోకి సైకో వెళ్లి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశాడు పరిసర ప్రాంతాల్లో ప్రజలు భయాందోళన చెందారు. పోలీసులు సైకోను పట్టుకోవడానికి విశ్వ ప్రయత్నం చేశారు. స్థానికులు, ,పోలీసుల కలిసి అతని పట్టుకొని జైల్లో పెట్టారు. పత్తికొండ మండలం హోసూరుకు చెందిన అల్లిపీర కుమారుడు వన్నూరు అని పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని వెల్లడించారు.

మట్టి మాఫియా పై చర్యలు తీసుకోవాలి


-జర్నలిస్టుల స్థలాలను పరిరక్షించాలి
-జర్నలిస్టుల సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జర్నలిస్టుల స్థలాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలను చేపడుతున్న మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని జర్నలిస్టుల సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట జగన్నాథ గట్టు సమీపంలో జర్నలిస్టుల స్థలాల్లో అక్రమ మట్టి తవ్వకాలు చేపట్టిన మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జర్నలిస్టు సంఘాలు ధర్నా చేశాయి. ఎపిడబ్ల్యుజెఎఫ్ , ఎపిడబ్ల్యుజెయు, జర్నలిస్టు ఫోరమ్, జర్నలిస్టు సంఘాల జెఎసి నాయకులు ధ్నాలో పాల్గొన్నారు. రాష్ట్ర కార్యదర్శి టి.మద్దిలేటి, జెఎసి కన్వీనర్ టి.ప్రసాద్, నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివ నాగేంద్ర, జిల్లా నాయకులు చంద్రమోహన్, పానుగంటి చంద్రయ్య ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా నాయకులు నాగరాజు, శ్రీనివాసులు గౌడ్ కొండప్ప ఎపిజెఎఫ్ నాయకులు రామకృష్ణ, సాయికుమార్ నాయుడు, జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ సభ్యులు సుబ్బయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్నాథ గట్టు సమీపంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి జర్నలిస్టులు మార్కెట్ విలువ చెల్లించి అక్కడ స్థలాలను కొనుగోలు చేశారన్నారు. గత కొన్ని రోజులుగా తమ స్థలాల్లో అధికార పార్టీకి చెందిన కొంత మంది నేతల అండతో ఎర్రమట్టి మాఫియా అక్రమ తవ్వకాలను చేపడుతుందన్నారు. రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్, ఎస్‌పి జోక్యం చేసుకొని ఎర్రమటి మాఫియా ఆగడాలని అడ్డుకట్ట వేసి వారిపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒకు, అడిషనల్ ఎస్‌పి డి.ప్రసాద్‌కు వినతి పత్రాలు సమర్పించారు.



అడిషనల్ ఎస్‌పి ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

ఘనంగా టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం



కేట్ కట్‌చేసి గౌరుచరితకు తినిపిస్తున్న గౌరువెంకట్‌రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరం మాధవి నగర్ గౌరు దంపతుల స్వగృహంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం వేడుకలను టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఓర్వకల్లు, కల్లూరు మండలాలు కల్లూరు అర్బన్ వార్డ్ ఇంచార్జిలు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ అకేపోగు వెంకట స్వామి, నంద్యాల పార్లమెంట్ మహిళ అధ్యక్షు రాలు కె. పార్వతమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా కార్యాలయంలో: టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత పార్టీ కార్యాలయం లోను, జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో పార్టీ పార్లమెంట్ లీగల్ సెల్ అధ్యక్షులు కెయి జగదీష్ ఆధ్వర్యంలో పార్టీ లీగల్‌సెల్ కమిటీ సభ్యులు నిర్వహించారు.

కోడుమూరు: కోడుమూరు మండలం, ఆమడగుంట్ల గ్రామంలో టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోడుమూరు పట్టణ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు బిపి ఎల్లప్ప నాయుడు ఆధ్వర్యంలో టిడిపి జెండాను ఆవిష్కరించారు. టిడిపి రాష్ట్ర మహిళా అధి .కార ప్రతినిధి సిబి లత , సర్పంచి భాగ్యరత్న , రాష్ట్ర బిసి సెల్ కెఇ. రాంబాబు గౌడ్ , మాజీ సింగల్ వీడియో అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి , హేమాది రెడ్డి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తుగ్గలి : తుగ్గలి, శభాష్ పురం, రాంపురం, రాతన, ఎర్రగుడి అయితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో 41వ టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిరవహించారు.

గూడూరు: గూడూరు నగర పంచాయతీలో కర్నూలు పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ మాజీ కెడిసిసి డైరెక్టర్ రాజారెడ్డి, మాజీ నీటి సంఘం అధ్యక్షులు చెట్టుకింద మద్దిలేటి బస్టాండులో టిడిపి జెండాను ఆవిష్కరించి కేకుకట్ చేసి సంబరాలు నిర్వహించారు.



బార్ అసోసియేషన్‌కు జాయింట్ సెక్రెటరీగా లక్ష్మణ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల నేపథ్యంలో జాయింట్ సెక్రటరీగా పోటీ చేసిన సింగరాజు లక్ష్మణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సింగరాజు లక్ష్మణ్ 2010లో కర్నూలు బార్ అసోసియేషన్‌లో రిజిస్టర్ అయ్యాడు. న్యాయవాదవృత్తిని కొనసాగిస్తూ పలు రకాల కేసుల్లో తనదైన శైలిలో వృత్తిరీత్యా ప్రతిభను కనపరుస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. దీంతోపాటు ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగాను, కర్నూలు నగర ప్రధాన కార్యదర్శిగాను న్యాయవాదుల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పలు పోరాటాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇటీవల 2023– 24 సంవత్సరానికి సంబంధించి నిర్వహిస్తున్న కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా జాయింట్ సెక్రటరీగా పోటీ చేశారు. పోటీలో ఎవరు ముందుకు రాకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా విజయం సాధించారు. దీనికి స్థానిక జిల్లా బార అసోసియేషన్ సభ్యులు పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను ప్రజాశక్తి పలకరించగా తను విద్యార్థి దశ నుంచే పోరాటాల్లో పాల్గొంటున్నానని తెలిపారు. ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులుగా, నగర ప్రధాన కార్య దర్శిగా న్యాయం0ంంవాదులకు న్యాయవాదుల సంక్షేమం కోసం నిర్వహిం చిన పలు పోరాటాల్లో చురుకైన పాత్రను పోషించా నన్నారు. ప్రస్తుతం వీటన్నిటిని కొనసాగిస్తూనే భవిష్యత్తులో న్యాయ వాదులకు అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికై నందుకు చాలా సంతో షంగా ఉందని, సహకరించిన ప్రతి ఒక్క న్యాయ వాదికి కృతజ్ఞతలు తెలిపారు.

గుండ్రేవులలో ఘనంగా ఉరుసు మహోత్సవం

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని గుండ్రేవులలో బుధవారం ఉరుసు మహోత్సవం ఘనంగా జరిగింది. భక్తులు సుమారు 50 వేల మంది పాల్గొని ఉంటారని దర్గా పీఠాదిపతి మహబూబ్ పేర్కొన్నారు. ఇక్కడే దర్గాను మొక్కి తరించినట్లు పేర్కొన్నారు.భక్తులకు ఎంపిపి ఉచిత తాగునిటీ సరఫరా చేశారు. ఉరుసు సందర్భంగా గుండ్రేవుల ఎంపిటిసి నూర్ జహాన్ ఉచితంగా తాగునీటిని సరఫరా చేయడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

నదిలో ఈతకొడుతూ సిబెళగల్ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని గుండ్రేవుల వద్ద తెలంగాణ నుండి ఇవతల ఒడ్డుకు ఈత కొడుతూ వస్తుంటే సిబెళగల్‌కు చెందిన వడ్డే నీలప్ప (65) మతి చెందినట్లు ఎస్ఐ పీరయ్య తెలిపారు. బుధవారం ఉరుసు సందర్భంగా వెళ్లి నది అవతల విందు విహారం చేసి తిరుగు ముఖం పట్టాడు. కాసేపట్లో ఇంటికి చేరుకోవాల్సిన ఆయన మతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ప్రతి మహిళా లక్షాధికారి కావడమే లక్ష్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్
- కుర్చీలు లేక నేలపై కూర్చున్న మహిళలు
- సీసీ రోడ్లు, డ్రైయినేజీలపై ఎమ్మెల్యే నిలదీత

ప్రజాశక్తి-ఆదోనిరూరల్


లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్రతి మహిళా లక్షాధికారి కావడమే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. బుధవారం మండలంలోని మదిరే గ్రామంలో వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరయి మాట్లాడారు. మండలంలో 1,174 గ్రూపులు ఉండగా వైఎస్ఆర్ ఆసరా మూడో విడత కింద రూ.5,16,98,000 మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపిడిఒ గీతావాణి, ఎపిఎం జనార్ధన, ఎంపిపి దానమ్మ, ఎంఇఒ శివరాములు, సర్పంచి నారాయణ, మాజీ సర్పంచి చంద్రశేఖర్, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కామాక్షి తిమ్మప్ప, తాలూకా సిఐ మహేశ్వర్ రెడ్డి, ఎస్ఐ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కుర్చీలు లేక నేలపై కూర్చున్న మహిళలు

ఆసరా కార్యక్రమానికి మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కుర్చీలు లేకపోవడంతో చంటి బిడ్డతో సహా నేలపై కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు మండలం మొత్తం ఒకే గ్రామంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరు కావడంతో కుర్చీలు లేక ఇబ్బందులు పడ్డారు. మరోపక్క వెలుగు సిబ్బంది కూడా మండల స్థాయి అధికారులకు, సర్పంచులకు, ఎంపిటిసిలకు సమాచారం లేకుండా సమావేశం ఏర్పాటు చేశారని కొందరు ప్రజా ప్రతినిధులు వాపోయారు. ప్రొటోకాల్ పాటించకుండా వేదికపై అనధికారులు కూర్చోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

సీసీ రోడ్లు, డ్రైయినేజీలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను నిలదీసిన దళిత మహిళలు

ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి హాజరు కాగా సమావేశం ముగిసిన అనంతరం దళిత కాలనీలో కనీసం సీసీ రోడ్లు, డ్రైయినేజీలు ఏర్పాటు చేయడంలో సర్పంచి నిర్లక్ష్యం వహిస్తున్నారని దళిత మహిళలు ఎమ్మెల్యేను నిలదీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎంపీ నిధుల కింద త్వరలో డ్రైయినేజీలు, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.


దేవనకొండలో చెక్కును అందిస్తున్న గుమ్మనూరు

దేవనకొండ : మహిళల అభ్యున్నతే లక్ష్యంగా వారి ఆర్థిక అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర కార్మిక, ఉపాధి కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సహకార సొసైటీ కార్యాలయ ఆవరణలోని ఫంక్షన్ హాలులో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కును పంపిణీ చేశారు. మండలంలోని 622 సంఘాల్లోని 6,145 మంది లబ్ధిదారులకు రూ.1.92 కోట్ల చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. హెచ్‌డిసిసి నరసన్న అధ్యక్షత వహించారు. డిఆర్‌డిఎ పీడీ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ... ప్రతి మహిళనూ రుణ విముక్తులను చేయడం వైఎస్ఆర్ ఆసరా పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వైసిపి ఏరియా కోఆర్డినేటర్ రాఘవేంద్ర, ఎంపిడిఒ గౌరీదేవి, ఎపిఎం రమేష్, ఎంపిపి లక్ష్మీదేవి భర్త లుమాంబా, జడ్‌పిటిసి రామకృష్ణ, వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాకర్ల శాంతి కుమార్, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, వైసిపి మండల నాయకులు ప్రభాకర్ రెడ్డి, దివాకర్ నాయుడు, ప్రేమ్‌నాథ్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, చిట్టెం చిన్నయ్య శెట్టి, కబీర్, చంద్రన్న, కొత్తపేట బాబు, మండల సమాఖ్య అధ్యక్షులు సుంకు లక్ష్మి పాల్గొన్నారు.


కౌతాళంలో మాట్లాడుతున్న ప్రదీప్ రెడ్డి

కౌతాళం : వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మహిళల జీవితాల్లో వెలుగులు వికసించాయని వైసిపి యువ నేత వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. బహిరంగ సభలో వైఎస్ఆర్ ఆసరా పథకం కింద 830 గ్రూపులకు రూ.9.81 కోట్ల చెక్కును అందజేశారు. వైసిపి నాయకులు దాట్ల కృష్ణంరాజు, దేశాయ్ ప్రహ్లాద చారి, వీర సేనా రెడ్డి, ఉరుకుంద ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నాగరాజు గౌడ్, ఏకం రెడ్డి, రామన్న గౌడ్, ఎంపిపి అమ్రేష్, జడ్‌పిటిసి రాధా ప్రియదర్శిని, సర్పంచి పాల్ దినకరన్, గురునాథ్ రెడ్డి, చౌదరి బసవరాజ్, తహశీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఎంపిడిఒ జగన్మోహన్ రెడ్డి, ఎపిఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరులో జీపు జాతాను ప్రారంభిస్తున్న రామాంజనేయులు

ఏప్రిల్ 5న చేపట్టే 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, రైతు సంఘం నాయకులు హనుమంతు, వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.తిమ్మన్న, సిఐటియు డివిజన్ ప్రధాన కార్యదర్శి బి.రాముడు కోరారు. బుధవారం 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని చేపడుతున్న జీపుజాతాను రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. జీపుజాతా మండలంలోని అన్ని గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై భారాలు వేయడం, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రైతులు, వ్యవసాయ కూలీలు నేడు గ్రామాలు విడిచి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని చెప్పారు. గ్రామాలు ఖాళీ అవుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఉపాధి హామీ చట్టం కింద 200 రోజులు పని దినాలు కల్పించి, కనీస వేతనం రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం, వ్యకాస, సిఐటియు నాయకులు ఎం.అబ్దుల్లా, యు.రమేష్, రాముడు, రాజు, నాగేంద్ర, ఏసేపు పాల్గొన్నారు. **కోసిగి (రూరల్)** మండలంలో సిఐటియు, రైతుసంఘం, వ్యకాస ఆధ్వర్యంలో ఆటో జాతా నిర్వహించారు. కోసిగి, సజ్జలగుండం, జంపాపురం, ఐరనగల్, సాతనూరు, అగసనూరు, కందుకూరు, కామన్‌దొడ్డి, ఆర్లబండ, దుద్ది తదితర గ్రామాల్లో ఆటోజాతా సాగింది. ఈ సందర్భంగా నాయకులు రాముడు, వీరేష్ మాట్లాడారు. సిఐటియు నాయకులు వెంకటేష్, మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రాజు పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని అన్ని గ్రామాల్లో జీపుజాతా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.తిమ్మన్న, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు మాట్లాడారు. రైతు సంఘం, వ్యకాస, సిఐటియు నాయకులు ఎం.అబ్దుల్లా, యు.రమేష్, రాముడు, రాజు, నాగేంద్ర, ఏసేపు పాల్గొన్నారు.

భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారిద్దాం

- ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

సమాజంలో లింగ అసమానతలకు కారణమవుతున్న లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలను సంపూర్ణంగా నివారించేందుకు కృషి చేద్దామని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. బుధవారం పిసిపిఎన్‌డిటి చట్టంపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్కానింగ్ సెంటర్ల యాజమాన్యం, గైనకాలజిస్ట్ వైద్యులకు డీఎస్పీ వినోద్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ సత్యవతితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ఆలోచన విధానంలో మార్పులు తీసుకురావడం ద్వారానే భ్రూణ హత్యలను నివారించగలమని తెలిపారు. రానున్న రోజుల్లో గర్భస్థ శిశువులపై లింగ వివక్షకు వ్యతిరేకంగా, పిసిపిఎన్‌డిటి చట్టంపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ కేంద్రాలపై సమాచారం అందించిన వారికి నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. పిసిపిఎన్‌డిటి చట్టం ప్రకారం స్కానింగ్ కేంద్రాలపై కచ్చితమైన సమాచారం అందించిన వారికి రూ.లక్ష వరకు బహుమతి అందించే అవకాశం ఉందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ పిసిపిఎన్‌డిటి చట్టాన్ని ఉల్లంఘిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అనంతరం స్కానింగ్ సెంటర్ల లైసెన్స్, రెన్యువల్, సిబ్బంది నమోదు వివరాలు తదితర రికార్డులను తనిఖీ చేసి పిసిపిఎన్‌డిటి చట్టం అవగాహన గోడపత్రికను విడుదల చేశారు. ఏరియా ఆస్పత్రి డాక్టర్ పద్మ కుమార్, ఎంసిహెచ్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత, ట్రూటౌన్ సిఐ శ్రీనివాస్ నాయక్, జిల్లా మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత పాల్గొన్నారు.



గోడపత్రికను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్


మీనాక్షినాయుడును సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

దేవాలయానికి మీనాక్షి నాయుడు విరాళం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దహరివాణం దళిత కాలనీలో మారెమ్మ అవ్వ దేవాలయ పునర్నిర్మాణానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు విరాళం అందజేశారు. బుధవారం దళితవాడ పెద్దల సమక్షంలో, టిడిపి నాయకులు ఆదిశేషిరెడ్డి, మాజీ ఎంపిటిసిలు నాగరాజ్, బసవరాజ్, నల్లారెడ్డి, నాగప్ప సమక్షంలో రూ.1.51 లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాతల సహకారంతో నిర్మిస్తున్న దేవాలయానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడును సన్మానించారు.

మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టిన

మార్కెట్ వేలాలపై చర్చ నిల్

- ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిన కౌన్సిల్
- సాఫీగా సాగిన కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - ఆదోని


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి వేదికగా ఉన్న కౌన్సిల్ ప్రాధాన్యత కోల్పోతోందని పలువురు విమర్శిస్తున్నారు. ఆదోని మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గడ్డి కొట్టిన ఆదోని మున్సిపల్ మార్కెట్ వేలాలను మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాలక మండలి, అధికార పార్టీ వైసిపి కౌన్సిల్ సభ్యులు ఎలాంటి చర్చ చేయకుండానే ఎకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో అధికార పార్టీ పనులపై ఎప్పుడూ ప్రశ్నించే ఏకైక టిడిపి కౌన్సిలర్ పార్వతి సమావేశానికి హాజరు కాలేదు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ బోయ శాంత అధ్యక్షతన జరిగింది. ఇటీవల జరిగిన మున్సిపల్ మార్కెట్ వేలాలు కౌన్సిల్ సమావేశంలో చర్చకు ఉంచారు. షరా మామూలే అన్నట్టుగా సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు వీధి కుక్కల నియంత్రణ, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సమస్యపై చర్చించారు. మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి కొట్టిన మార్కెట్ వేలాలపై మాత్రం ఎలాంటి చర్చ చేయకుండానే కనీసం కౌన్సిల్ సమావేశంలో ఆ అజెండాను చదవకుండానే 'పాస్... పాస్' అంటూ ప్రకటించారు. మున్సిపాలిటీ ఆదాయానికి మున్సిపల్ మార్కెట్ వేలాల ద్వారా గండి పడిన విషయంపై ఈనెల 26న అన్ని వార్త పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ విషయంపై కౌన్సిల్‌లో సభ్యులు చర్చ చేయకపోవడం గమనార్హం. హిందూ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు చేపట్టాలని, మృతదేహాలను కాల్చేందుకు విద్యుత్ మిషన్‌ను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ బాలాజీ కోరారు. పట్టణంలో విపరీతంగా పెరిగిపోయిన వీధి కుక్కలను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు చేసుకోవాలని తెలిపారు. కుక్కల సంతతి నిరోధక చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి వివరించారు. విద్యుత్ కోత సమయంలో డీజిల్ ద్వారా మోటార్ల నిర్వహణకు డీజిల్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చూసుకుంటున్నామని మున్సిపల్ ఇంజినీర్ నాగభూషణం రెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రధాన సర్కిల్‌లో ప్రత్యేకంగా హైవోల్టేజీ విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని, జిమ్ రోడ్డులో డివైడర్లు ఏర్పాటు చేసి మోడల్ రోడ్డుగా తీర్చిదిద్దాలని కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి కోరారు. మూడో వార్డులో గత ఆరు నెలలుగా బోరు మోటార్ చెడిపోయిందని, దానిని మరమ్మతులు చేయించాలని, అర్ధాంతరంగా నిలిపేసిన మరుగు నీటి కాలువ నిర్మాణాన్ని పూర్తి చేయాలని కౌన్సిలర్ మహేశ్వరి కోరారు. ఫరిసా మొహల్లాలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పైపు లైన్లు వేసి నీరందించాలని కౌన్సిలర్ తెలిపారు. ఆదోని పట్టణంలోని 42 వార్డుల్లో 2019 నుంచి 2023 వరకు జరిగిన అభివృద్ధి పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. పట్టణంలో ఈ మూడేళ్లలో రూ.29.90 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయని, రోజూ పట్టణంలో రూ.1.45 లక్షలు అభివృద్ధి పనులకు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్డులో మున్సిపాలిటీ దుకాణాలు నిర్మించి ఏళ్ల గడుస్తున్నా వాటిని ఎందుకు ఉపయోగంలోకి తేవడం లేదని కౌన్సిలర్ సందీప్ రెడ్డి ప్రశ్నించారు. దీనిపై పూర్తి స్థాయిలో నివేదికలు తయారు చేస్తున్నామని, త్వరలోనే టెండర్లు పిలుస్తామని కమిషనర్ రఘునాథ్ రెడ్డి తెలిపారు. వైస్ ఛైర్మన్లు గౌస్, నరసింహులు, మున్సిపల్ అధికారులు రాజు, వెంకట చలపతి రెడ్డి, మదన్, కృపాకర్, రాజశేఖర్ రెడ్డి, కౌన్సిలర్లు చలపతి, లక్ష్మీదేవి, ఉస్మాన్, అశోక్, సురేష్, రాజేశ్వర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తిమ్మక్క పాల్గొన్నారు.

ఇద్దరితో ఎలా సాధ్యం..?

- ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలి : సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలో పాండవగల్లు ప్రాథమిక పాఠశాలలో 220 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, ఉపాధ్యాయులు మాత్రం ఇద్దరే ఉన్నారని, ఇద్దరితో ఇంతమంది విద్యార్థులకు బోధన ఎలా సాధ్యమవుతుందని సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న, మాజీ ఎంపిటిసి, విద్యా కమిటీ మాజీ ఛైర్మన్ రామాంజనేయులు ప్రశ్నించారు. బుధవారం పాండవగల్లులో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు లాంటి పథకాల ద్వారా రూ.వేల కోట్లు కేటాయిస్తున్నా ఉపాధ్యాయులను మాత్రం నియమించడం లేదని విమర్శించారు. 200 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలకు ఉపాధ్యాయులు లేకపోతే పిల్లలకు చదువు ఎలా అందుతుందని ప్రశ్నించారు. అనంతరం నాయకులు ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒను ఫోన్‌లో సంప్రదించారు. 1998 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులను త్వరలోనే నియమించి ఉపాధ్యాయుల కొరతను తీర్చడానికి ప్రయత్నిస్తున్నామని ఎంఇఒ శివరాములు తెలిపారు. 15 రోజుల్లోగా ఉపాధ్యాయులను నియమించాలని, లేకపోతే పాఠశాలకు తాళాలు వేయాల్సి వస్తుందని సిపిఎం నాయకులు హెచ్చరించారు. సిపిఎం నాయకులు కె.గోవిందు, హనుమంతు, భీమయ్య, హనుమంతురెడ్డి, రమేష్, కొండయ్య, తిక్కయ్య పాల్గొన్నారు.

పాఠశాలలో అధికారుల తనిఖీలు

గోనెగండ్ల : గోనెగండ్లలోని మండల పరిషత్ ప్రాథమిక (బస్టాండ్) పాఠశాలను సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి టి.శివశంకర్, ప్రథం జిల్లా కోఆర్డినేటర్ నరేష్ సందర్శించారు. 3, 4, 5వ తరగతుల విద్యార్థులతో తెలుగు పుస్తకం చదివించారు. వెనుకబడిన విద్యార్థులను లెవెల్ 1, 2గా విభజించాలన్నారు. అలాగే లెక్కల్లో చతుర్విధ ప్రక్రియలపై అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఇఒ వినోద్ కుమార్, ఇన్‌ఛార్జీ ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం పదిలం

- తహశీల్దార్ లక్ష్మీనారాయణ, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన

ప్రజాశక్తి - చిప్పగిరి

బలవర్ధకమైన పౌష్టికాహారం తీసుకుంటే గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని తహశీల్దార్ లక్ష్మీనారాయణ, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన సూచించారు. బుధవారం చిప్పగిరి ఎస్సీ కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో ఆరు నెలలకోసారి జరిగే పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తహశీల్దార్ లక్ష్మీనారాయణ, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు పాల్గొని ఇంట్లోనే చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను రుచి చూసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా ప్రభుత్వ నియమాలు పాటిస్తూ అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని భుజించాలని కోరారు. విఆర్ఒ తిమ్మప్ప, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పట్టణంలోని టిడిపి నాయకుని స్వగృహం వద్ద బుధవారం టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహించారు. ముందుగా ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు బసలదొడ్డి ఈరన్న, మీ సేవ ఆంజనేయ, టిడిపి నాయకులు మల్లికార్జున, కల్లుకుంట దాసప్ప రెడ్డి, డీలర్ నాగప్ప, సర్దార్ బాష, నరసింహులు, ఏసు, ఈరన్న, దశరథ రాముడు, నరసన్న, ప్రతాప్ రెడ్డి, మునెప్ప పాల్గొన్నారు.

డీలర్లు సకాలంలో డిడిలు చెల్లించాలి

- తహశీల్దార్ మల్లికార్జున

ప్రజాశక్తి - హొలహర్వి

డీలర్లు సకాలంలో డిడిలు చెల్లించాలని తహశీల్దార్ మల్లికార్జున తెలిపారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మల్లికార్జున అధ్వర్యంలో డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలాల్లో బియ్యం పంపిణీ మాత్రమే జరుగుతోందని, కంది బేడలు, చక్కెర ఇవ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. డీలర్లు రేషన్ బియ్యంతో పాటు అన్ని వస్తువులకు డిడిలు కట్టాలని చెప్పారు. డీలర్లు రేషన్ బియ్యంతో పాటు అన్ని సరుకులను పంపిణీ చేయాలని సూచించారు.

టిడిపితోనే పేదల సంక్షేమం

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి
- ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - మంత్రాలయం


మంత్రాలయంలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి


ఆదోనిలో మాట్లాడుతున్న భూపాల్ చౌదరి

పేదల సంక్షేమం కోసమే ఎన్‌టి.రామారావు టిడిపిని స్థాపించారని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. రూ.2లకు కిలో బియ్యం పథకంతో చరిత్ర సృష్టించారన్నారు. చంద్రబాబు నాయుడు కూడా అదే బాటలో నడిచి పార్టీని ముందుకు సాగిస్తున్నారని కొనియాడారు. 2024 ఎన్నికల్లో టిడిపి గెలుపు ఖాయమని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా కార్యదర్శి బూదూరు మల్లికార్జున రెడ్డి, క్లష్టర్ ఇన్‌ఛార్జీ చావిడి వెంకటేష్, గోపాల్ రెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, వగరూరు పవన్ కుమార్ రెడ్డి, అబ్దుల్ సాబ్, దస్తగిరి, లింగప్ప, సూగూరు భాస్కర్ రెడ్డి, సుంకేశ్వరి రోగన్న, మాలపల్లి చంద్ర, లక్ష్మన్న, లక్ష్మారి నరసింహులు, రామయ్య, వీరేష్, ఈరన్న గౌడ్, వెంకట రాముడు, ఎంపిటిసిలు వెంకటేష్, వట్టేప్ప గారి నరసింహులు, మేకల నరసింహులు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి ఏబు, శివ, చెట్నిపల్లి తిక్కస్వామి గౌడ్, రవి, రాఘవ రెడ్డి పాల్గొన్నారు. **ఆదోని**లో మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు టిడిపి కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహం వద్దకు చేరుకొని పూలమాల వేసి నివాళులర్పించారు. రంగస్వామి నాయుడు, సిద్ధార్థ నాయుడు, మారుతి నాయుడు, బుద్ధారెడ్డి, జయరాం, తిమ్మప్ప, వాల్మీకి వెంకటేష్, రంగన్న, సజ్జాత్ హుస్సేన్, రామాంజి, అల్తాఫ్, కృష్ణారెడ్డి, నాగరాజు, అరెకల్ రామకృష్ణ, మాధవ్, సుబ్బారెడ్డి, రాము, వీరేష్ పాల్గొన్నారు. **దేవనకొండ** పట్టణంలోని టిడిపి మండల కార్యాలయంలో మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్ ఆధ్వర్యంలో జెండాను ఎగుర వేశారు. టిడిపి నాయకులు బడిగింజల రంగన్న, ఉచ్చీరప్ప, ఆకుల వీరేష్, మల్లయ్య, మలకన్న, జనార్ధన్ రెడ్డి, రమణారెడ్డి, సర్పంచులు నాగరాజుగౌడ్, హనుమంతు, చిన్న రామప్ప, మాల బండ్లయ్య, నక్క నరసింహుడు, ఎంపిటిసి తిమ్మప్ప, నాయకులు పొట్లపాడు వెంకటేష్, డీలర్ బండ్లయ్య, రామదాస్ గౌడ్, మల్లికార్జున గౌడ్, తెలుగు యువత నాయకులు రాజా సాహెబ్, కాశీం, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పెద్దయ్య, రాజశేఖర్ గౌడ్, రాజగోపాల్ గౌడ్, నాగేష్, తిమ్మప్ప, రామాంజనేయులు, చాంద్ పాల్గొన్నారు. **చిప్పగిరి**లో టిడిపి నాయకుల సమక్షంలో అంబేద్కర్ విగ్రహానికి, ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, మాజీ జడ్‌పిటిసి మీనాక్షి నాయుడు, ఎంపిటిసి రజిని, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, సర్పంచులు గోవిందు, పురుషోత్తం, సురేష్, మాజీ ఎంపిటిసి భాస్కర్, టిడిపి జిల్లా సహాయ కార్యదర్శి సోమశేఖర్ నాయుడు, దౌల్తాపురం రామాంజిని, అంపయ్య, జయన్న, అమరేష్, కొండ రామాంజిని, గురుగోపాల్, దస్తగిరి పాల్గొన్నారు. **ఆస్పరి** పట్టణంలోని గాంధీ పార్కు వద్ద మాజీ ఎంపిపి కృష్ణ యాదవ్, ఎంపిటిసి నరసప్ప, టిడిపి సీనియర్ నాయకులు రామచంద్ర రెడ్డి, తిమ్మన్నలు ఎన్‌టి.రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు శ్రీనివాస్ గౌడ్, నాగన్న, శీనప్ప, సతీష్ కుమార్, యూత్ కన్వీనర్ రాఘవేంద్ర, తెలుగు యువత అధికార ప్రతినిధి రాజ్‌కుమార్, మహేష్, నాగేంద్ర, మారేష్, వెంకటేష్, మహేష్, గ్రామ కమిటీ అధ్యక్షులు వీరేష్, జూనియర్ ఎన్‌టిఆర్ సేవా సమితి అధ్యక్షులు వీరేష్, నరేష్ పాల్గొన్నారు. **నందవరం**లోని టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ చిన్నారాముడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు దేశాయ్ మాధవరావు దేశాయ్, సీనియర్ నాయకులు వెంకట రామిరెడ్డి, ఖాసీం వలీ, గోపాల్, మండల నాయకులు నదికైరవాడి వీరేష్, లక్ష్మన్న, రెహ్మాన్, వడ్డే గోపాల్, విశ్వనాథ్, గిర్ని ఈషా, పూలచింత షరీఫ్, బోయ వీరేష్, భీమశేఖర్ పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని టిడిపి కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. ఎన్‌టి.రామారావు, మాజీ మంత్రి కీర్తిశేషులు బీవీ.మోహన్ రెడ్డి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, బేతాళ బడేసా, కృష్ణమ నాయుడు, ఎన్‌వి.రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, రమేష్ నాయుడు, కులుమాల రాముడు, మదీనా సాహెబ్, శ్రీధర్ నాయుడు, నూర్ అహ్మద్, అచ్చుగట్ల కొత్తింటి ఫక్రుద్దీన్, కులుమాల చాంద్ బాష, ఎర్రబాడు శీను పాల్గొన్నారు. **హొలహర్వి**లో టిడిపి మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టిడిపి యువ నేత నిట్రవట్టి తిప్పేస్వామి, సికిందర్ పాల్గొన్నారు. **హోళగుంద** మండలంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


దేవనకొండలో జెండాను ఎగురవేస్తున్న నాయకులు


చిప్పగిరిలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు


ఆస్పరిలో నివాళులర్పిస్తున్న నాయకులు


గోనెగండ్లలో

పోటాపోటీగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

- అయోమయంలో తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఒక పండగలా జరపాల్సి ఉండగా మండల నాయకులు వేర్వేరుగా నిర్వహించారు. తెలుగు తమ్ముళ్ల అయోమయానికి గురయ్యారు. బుధవారం మండలంలో టిడిపి మండల కన్వీనర్ గోతుల దొడ్డి ఉలిగయ్య ఆధ్వర్యంలో తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడు, సతీష్ నాయుడు, రామలింగ, నీలకంఠారెడ్డి, సిద్ధప్ప, ముక్కన్న, వీరేష్, ఎంకోబా, చంద్రలు టిడిపి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఊరేగింపు చేశారు. తిక్కా రెడ్డి వర్గమైన ఉరుకుంద ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప ఆధ్వర్యంలో తెలుగు యువత జిల్లా నాయకులు దివాకర్ రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర జిల్లా కార్యదర్శి అడివప్ప గౌడ్, వెంకటపతి రాజు, కోటేష్ గౌడ్, టిప్పు సుల్తాన్, సిద్ధు, రాజానందు, రాజాబాబు జెండాను ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఇలా కౌతాళంలో రెండు చోట్ల వేర్వేరు కార్యక్రమాలు చేపట్టడంతో తెలుగు తమ్ముళ్లు అయోమయానికి గురయ్యారు. జిల్లా నాయకులు స్పందించి అందరూ కలిసి పార్టీ కార్యక్రమాలు చేసేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు. **ఆలూరు**లో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట్ల సుజాతమ్మ ఆదేశాల మేరకు టిడిపి కార్యాలయం ముందు రాష్ట్ర నాయకులు సి.నారాయణరెడ్డి జెండా ఆవిష్కరించారు. నాయకులు సులక్షణ రెడ్డి, నారాయణ, నర్సప్ప, మురళీ రెడ్డి, అశోక్, చంద్రశేఖర్, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. టిడిపి మాజీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్, వైకుంఠం మల్లికార్జున చౌదరి తమ అనుచర వర్గాలతో తమ ఇళ్ల దగ్గర ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ కేంద్రంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు నాయకులు కార్యక్రమాలు చేపట్టడం చూసి తెలుగు తమ్ముళ్ల అయోమయానికి గురయ్యారు. ఆలూరులో టిడిపి జెండా ఎగరడం కష్టమని తెలుగు తమ్ముళ్లు, ప్రజలు పేర్కొంటున్నారు.

ప్రజాశక్తి
గురువారం 30 మార్చి 2023
5
నంద్యాల





నంద్యాలలో బైక్ ర్యాలీ చేపడుతున్న సిఐటియు నాయకులు

పదిలో వంద శాతమే లక్ష్యం

- ప్రభుత్వ పాఠశాలల్లో అందరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి



స్టడీ అవర్స్ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/నంద్యాల కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు, అధికారులు పని చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళిక కూడా రూపొందించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టారు..

విద్యార్థి దశలో పదో తరగతి చాలా కీలకమైనది. ప్రభుత్వ పాఠశాలలన్నీ వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు తగిన విధంగా ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. ఆ మేరకు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు నిరంతరం శ్రమిస్తున్నారు. జిల్లాలో జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్యాల కింద నిర్వహిస్తున్న 467 పాఠశాలల నుండి దాదాపు 25,411 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. పాఠశాలల్లో ఎవరైతే వెనుకబడిన విద్యార్థులు ఉంటారో వారిని గుర్తించి ప్రత్యేకంగా ఏ సబ్జెక్టులలో వెనకంజలో నిలిచి ఉంటారో ఆ సబ్జెక్టులో మరింత తర్ఫీదును సంబంధిత ఉపాధ్యాయుడి ద్వారా ఇప్పిస్తున్నారు. విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించడమే కాకుండా మోడల్ టెస్టులను కూడా నిర్వ హిస్తున్నారు. దాంతో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. విజయ దీపిక మెటీరియల్‌ను అందించి దాని ద్వారా ప్రాక్టీస్ చేయిస్తున్నారు. విద్యార్థుల ఆరోగ్యానికి కూడా ప్రాధాన్యతనిస్తూ సాయంత్రం స్నాక్స్‌ను కూడా అందిస్తున్నారు.

పదిలో ఉత్తీర్ణత పెంపునకు చర్యలు



జిల్లాలో పదవ తరగతిలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాము. విద్యా సంవత్సరం ప్రారంభం నుండే ఓ ప్రణాళిక ప్రకారం వెళ తున్నాం. ఈ ఏడాది మరింత ఉత్తీర్ణత సాధించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం.వ ఖ్యంగా విద్యార్థులను మూడు కేటగిరీలుగా విభజించి పూర్తిగా డల్‌గా ఉన్న విద్యార్థి పాస్ అయ్యేలాగా తర్ఫీదు ఇవ్వడం జరుగుతుంది. ప్రతి ఉపాధ్యాయుడికి ముగ్గురు లేక నలుగురు విద్యార్థులను దత్తత ఇవ్వడం జరిగింది. స్టడీ అవర్స్ పెంచడం, రివిజన్ టెస్ట్‌లు నిర్వహించడంతో పాటు సబ్జెక్టు ఉపాధ్యాయులకు ఓరియంటల్ ప్రోగ్రాం నిర్వహించాం.

- అనురాధ, డిఇఒ.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు...



పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేకమైన తరగతులను ఉదయము సాయంకాలం వేళల్లో అక్టోబర్ మాసం నుండి నిర్వహిస్తున్నాం. ప్రతి రెండవ శనివారము, ఆదివారములలో కూడా సబ్జెక్టుల వారీగా టైం టేబుల్ వేసుకొని పోర్షన్స్ కంప్లీట్ చేసి విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. ప్రత్యేకించి సి, డి గ్రేడ్‌కు చెందిన విద్యార్థులకు సబ్జెక్టుల మెటీరియల్ తయారు చేసుకొని సంసిద్ధం చేయడం జరిగింది. పలు దఫాలుగా తల్లిదండ్రులను కలిసి వారి విద్యా పురోభివృద్ధిపై చర్చించాం.

- ఏ. నూర్జహాన్, హెచ్ఎం, ఈర్నపాడు జడ్‌పి హైస్కూల్, బండి ఆత్మకూరు మండలం.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

- నంద్యాలలో సిఐటియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ
- పోస్టర్లు విడుదల, జీపుజాతా, కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, రైతాంగ, వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరుతూ ఏప్రిల్ 5న జరిగే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం నంద్యాల పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సిఐటియు కార్యాలయం నుండి ప్రారంభమై నూనెపల్లె, రైల్వే స్టేషన్, వైయస్సార్ జంక్షన్(చామకాలువ), మున్సిపల్ ఆఫీస్, పద్మావతి నగర్, శ్రీనివాస్ నగర్, సంజీవనగర్, బంగారు అంగళ్ల మీదుగా గాంధీ చౌక్ చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తోట మద్దులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలనానరు. 44 కార్మిక చట్టాలను సక్రమంగా అమలు చేయాలని, కనీస వేతనాలను కార్మికులందరికీ ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, ఎరువుల ధరలు తగ్గించాలని, వ్యవసాయ కార్మికులకు 200 రోజులు ఉపాధి హామీ పని కల్పించాలని, 600 రూపాయలు రోజువారి కూలివేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు సమగ్ర చట్టం చేయాలని, ఐదు లక్షల మందికి పైగా రైతులు, ఉద్యోగులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులతో ఢిల్లీలో జరిగే ప్రదర్శన, భారీ బహిరంగ సభలో ప్రజలు అత్యధికంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, కె.మహమ్మద్ గౌస్, పట్టణ కోశాధికారి వెంకట లింగం, నాయకులు సుబ్బారావు, జైలాన్, మధు, వెంకట్రావు, కార్మికులు పాల్గొన్నారు. **పాములపాడు :** సిఐటియు, ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సామన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావులు గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు జగన్నాథ రావు, సురేషు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే మజ్దూర్, కిసాన్ సంఘార్స్ ర్యాలీలో జిల్లాలోని రైతులు, వ్యవసాయకూలీలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని కోటకొండ, కె.కొత్తూరు, ఎల్లావత్తుల, చిన్న కంబలూరు, కొండ మాయపల్లె, రుద్రవరం, నాగులవరం, నరసాపురం, ఆలమూరు గ్రామాల్లో జీపుయాత్ర ద్వారా ప్రచారం నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు, జిల్లా నాయకుడు శంకర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మార్క్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వి.బాల వెంకట్, వ్యవసాయ కార్మిక (మిగతా 6వ పేజీలో..)

మిర్చికి మెరుగైన ధర కల్పించేలా చర్యలు


- ట్రేడర్లు, వ్యాపారుల సంఖ్యను పెంచుతాం : ఆర్‌జెడి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



మాట్లాడుతున్న ఆర్‌జెడి రామాంజనేయులు

మిర్చి రైతులకు నంద్యాల మార్కెట్ యార్డ్‌లో మెరుగైన ధర వచ్చేలా చర్యలు తీసుకుంటామని రీజినల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు అన్నారు. నంద్యాల టెక్క మిర్చి యార్డును సెక్రటరీ కల్పనతో కలిసి ఆర్‌జెడి రామాంజనేయులు మిర్చి క్రయవిక్రయాలను బుధవారం పరిశీలించారు. మిర్చికి వస్తున్న ధరను రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సెక్రెటరీ ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. గుంటూరులో ఉన్న ధరే ఇక్కడ ఉందన్నారు. గత రెండు రోజుల నుండి ధర తగ్గిందన్నారు. మార్కెట్ యార్డ్‌లో కమిషన్ ఏజెంట్లకు షెడ్లు ఏర్పాటు చేస్తున్నామని, మిర్చి రైతులకు కనీస సౌకర్యాలు కల్పిస్తామన్నారు. టాయిలెట్ బ్లాక్ ఏర్పాటు, మినరల్ వాటర్ ప్లాంట్, శానిటేషన్ కల్పించి నంద్యాల మిర్చి యార్డును అభివృద్ధి చేస్తామన్నారు. స్థానిక మార్కెట్ యార్డ్ అధికారులు ప్రతిపాదించినవన్నీ చేస్తామన్నారు. మార్కెట్లో కమిషన్ ఏజెంట్ల సంఖ్యను కూడా పెంచాలని సెక్రెటరీ కల్పనకు సూచించారు. సెక్రటరీ కల్పన మాట్లాడుతూ మిర్చి మార్కెట్ యార్డ్‌కు మంచి స్పందన రైతుల నుండి లభించిందన్నారు. రైతుకు విశ్రాంతి భవనాలు నిర్మించడంతో పాటు మార్కెట్ యార్డు అభివృద్ధికి మరింత చర్యలు తీసుకుంటామని తెలిపారు.



రంజాన్ వేళలు

గురువారం
ఇఫ్తార్ : 6 : 35
శుక్రవారం

పొట్ట కూటి కోసం..

- పనుల కోసం ఇతర మండలాలకు వలస
- పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణం
- ఉపాధి పనుల కల్పనలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల మండలంలోని ఆయా గ్రామాల నుండి రోజుకు వేల సంఖ్యలో ప్రజలు పొరుగు గ్రామాలకు, ఇతర మండలాలకు పనుల కోసం వలస పోతున్నారు. నంద్యాల మండలంలోని బిల్లాలపురం, చాబోలు, అయ్యలూరు, పెద్ద కొట్టలా, కానాల గ్రామాల నుండి తెల్లవారుజామున ఇంటి, వంట పనులు ముగించుకుని సద్ది కట్టుకొని ప్రమాదమని తెలిసినా పొట్ట కూటికోసం తప్పని సరై ఆటోలో పరిమితికి మించి, ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణాలు చేస్తున్నారు. గతంలో బిల్లాలపురం నుండి కూలి పనుల కోసం పరిమితికి మించి కూలీలతో వెళ్తున్న ఆటో బలపనూర్ మెట్ట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూలీలందరూ తీవ్ర గాయాలపాలయ్యారు. మిట్నాల, పాండు రంగాపురం, భీమవరం, పోలూరు గ్రామాలకు మిరప పండు కోత కోసేందుకు పనికి వెళ్తున్నారు.

ఉపాధి వేతనం సరిపోవడం లేదు

'ఉపాధి పనులకు వెళ్తే రోజుకు రూ. 120 లేదా 150 రూపాయలు మాత్రమే పడుతుంది. ఏ రోజు కూడా 200 రూపాయలు దాటలేదు. అది కూడా మూడు వారాలకు ఒక ఒక్కసారి, నాలుగు వారాలకు ఒకసారి బిల్లులు పడతాయి. అంతవరకు ఇల్లు యెట్లా గడిచేది. అసలే శ్రీరామ నవమి, ఈస్టర్, రంజాన్ పండుగలు ఒకదాని వెంట ఒకటి వస్తుండే. మరి పని చేసుకుంటే తినాలి లేకపోతె ఇబ్బందులు పడాల్సి వస్తుంది.. అందుకే వేరే గ్రామాలకు పనులకు వెళ తున్నాం. పండు మిరప కోతకు వెళ్తే 300 రూపాయలు ఇస్తారు. అందులో ఆటో చార్జిలు 50 రూపాయలు పోతాయి.. మిగతా 250 రూపాయలు వస్తాయి. ఉపాధి పనులకు తక్కువ వేతనం వస్తుండడం, అదికూడా ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. అందుకే ఇతర గ్రామాలకు కూలికి 250 రూపాయల కోసం ప్రమాదకరమని తెలిసినా వెళ్తున్నాం. పనికి వెళ్తేనే పూట గడిచేది. లేకపోతే పస్తుండాల్సిందే..' అనిఅని మహిళా కూలీలు వాపోతున్నారు.

మస్టర్లలో చేతి వాటం..

కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు వారి కుటుంబ సభ్యులు రాకున్నా తల్లికి, తండ్రికి, చెల్లికి, భార్యకు, వచ్చినోనికి, రానివారికి మస్టర్లు వేసుకుంటారని, దాంతో పనికి వచ్చిన వారు ఎంత పని చేసినా కూలి తక్కువ పడుతుందని కూలీలు చెబుతున్నారు. 'పైన చెకింగ్‌కు వచ్చిన అదికారులేమో పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తారని, కూలి తక్కువ పడుతుందని అడిగితే ఏం చేస్తామమ్మా మీరు పని తక్కువ చేస్తున్నారు.. మీరు కొలతలు సరిగా వేసుకోవడం లేదు.. మీ పనిలో నాణ్యత లేదు' అని సమాధానం చెప్పి వెళ్ళి పోతారు తప్పా తప్పు ఎక్కడ జరుగుతుందో తెలుసుకోవడంలేదు.. అలా వస్తారు ఇలా వెళ్లి పోతారు..' అని కూలీలు వాపోతునానరు. అందుకే ప్రమాదమో ప్రయాసానో అనుకుంటే పండగ పూట పిల్లలు పస్తులు ఉండాల్సి వస్తుందని అంటున్నారు.

కూలీల సంఖ్య పెంచడంలో, పనులపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

ఉన్నతాధికారులు ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని చెబుతున్న కింది స్థాయి అధికారులు వాటిని గాలికి వదిలేస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారులు కూలీల సంఖ్య ఎందుకు పెరగలేదని అడిగితే క్రింది స్థాయి అధికారులు గ్రామాలలో వ్యవసాయ పనులు జరుగుతున్నాయని, అందుకే ఉపాధి పనులకు ప్రజలు సరిగా రావడం లేదని సమాధానం చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి పనులకు వచ్చేది పది మంది అయితే ఉన్నత అధికారులకు కూలీల సంఖ్య పెరిగిందని చూపడం కోసం కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని గ్రామాలలో ప్రజలు చర్చించుకుకంటున్నారు. ఈ విషయాలు అధికారులకు తెలిసినా పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు జాబ్ కార్డ్ ఉన్న ప్రజలకు పనులపై అవగాహన కల్పించి, కనీస వేతనం, 250 రూపాయలు వచ్చేలా చేసి, వారం రోజులు చేసిన పనికి వేతనం వచ్చే వారంలోనైనా వచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఇతర గ్రామాలకు వలస పోకుండా చూడాలని మహిళా కూలీలు కోరుతున్నారు.



కానాల గ్రామం నుండి పనుల కోసం ఆటోలో ప్రమాదకరంగా వెళ్తున్న మహిళలు





అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని 28వ వార్డులో రూ.31 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, డ్రైనేజీలు, పైపులైన్ పనులను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణంలో ప్రతిరోజు ఎక్కడో ఒకచోట అభివృద్ధి పనులను చేపడుతున్నామని, ఇది ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ప్రజలు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను గమనించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాం షావలి, రాష్ట్ర దృశ కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, మాజీ కౌన్సిలర్ అనిల్ అమృతరాజ్, రహంతుల్లా, స్థానిక వైసిపి నాయకులు పాల్గొన్నారు.

న్యూట్రిషియన్ రేషన్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణం 19వ వార్డు పొన్నాపురం కాలనీలోని ఇమ్మానుయేలు పౌండేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవి పేషంట్లకు న్యూట్రిషియన్ రేషన్ కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా వి.రవీంద్రపాల్ హాజరయ్యారు. బాధితులకు పౌండేషన్ చైర్మెన్ డా. ప్రభు ఇమ్మానుయేల్, మేనేజింగ్ ట్రస్టీ డా. రత్న ఇమ్మానుయేల్, ఫౌండర్ యల్.ఇమ్మానుయేల్‌లు భోజనం ఏర్పాటు చేశారు. బాధితులు ఇమ్మానుయేల్ పౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్‌కు ధన్యవాదాలు తెలిపారు. నంద్యాల గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ శానిటైజర్ ఇన్చార్జ్ సుభాష్, సంబంధిత ప్రాజెక్ట్ మేనేజరు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.



న్యూట్రిషన్ రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మహిళల అభ్యున్నతే సిఎం లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గడివేముల

మహిళల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గడివేములలోని రాజ రాజేశ్వరి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్యెల్యే హాజరయ్యారు. మండలంలోని 597 గ్రూపుల్లోని 5970 మంది స్వయం సహాయక పొదుపు మహిళలకు వైయస్ఆర్ ఆసరా పథకం మూడో విడత కింద మంజూరైన రూ. రూ.2,12,22,200 చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి నాగమద్దమ్మ, జడ్పిటిసి ఆర్బీ చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ విజయసింహారెడ్డి, శివరాం రెడ్డి, రఘు మాధవ్ రెడ్డి, ఎల్లారెడ్డి, శిరుపా శ్రీనివాస్ రెడ్డి, కోర్రపోలూరు సర్పంచ్ మాలిక్ బాషా, సుబ్బారెడ్డి, పొదుపు ఐఖ్య సంఘం అధ్యక్షురాలు అనురాధ, ఏపీఎం ఉస్మాన్, సీసీ శ్రీనివాసులు, వెంకటరాముడు, నాగశేషు, విఓఎల అధ్యక్షులు రామ మద్దిలేటి, పొదుపు మహిళలు పాల్గొన్నారు.



ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

సమగ్ర భూ రీ సర్వేపై డాక్యుమెంటరీ ఫిల్మ్

- పట్టణ ప్రణాళిక అధికారి సునీల్ రాజ్

ప్రజాశక్తి - ఆత్మకూరు

బిసురా క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న సమగ్ర భూ రీ సర్వేపై డాక్యుమెంటరీ ఫిల్మ్‌ను బుధవారం పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపాలిటీ కమిషనర్ శ్రీనివాస రావు క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా టిపిఒ సునీల్ రాజ్ మాట్లాడుతూ 1923లో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన భూ సర్వేను ప్రస్తుతం అధునాతన సర్వే పరికరాలతో రాష్ట్ర ప్రభుత్వం రూ.140 కోట్లు ఖర్చు చేసి 128 పురపాలక సంఘాలలో డ్రోన్లతో ఏరియల్ సర్వే చేస్తున్నామని తెలిపారు. ఈ సర్వేపై ఏలాంటి అపోహలకు తావులేకుండా షార్ట్ ఫిల్మ్ ద్వారా ప్రజలకు తెలియజేస్తామని చెప్పారు. దర్శకత్వం, మాటలు సునీల్ రాజ్, తారాగణం ఆత్మకూరు సచివాలయం సిబ్బంది పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, సచివాలయం సిబ్బంది, పాల్గొన్నారు.



క్లాప్ కొడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

ఉపాధ్యాయులను ఇబ్బందులు పెట్టడం తగదు : యుటిఎఫ్

ప్రజాశక్తి - బనగానపల్లె



మాట్లాడుతున్న సత్య ప్రకాష్

గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల్లో పొరపాటు చేసిన ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కే.సత్య ప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని యుటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షులు ఎన్ ప్రతాప్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం పదవ తరగతి పరీక్షల సందర్భంగా పొరపాటు చేసిన ఉపాధ్యాయులను ఈ సంవత్సరం పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలో తహశీల్దార్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, పరీక్ష ముగిసే వరకు అక్కడే ఉండాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎం వెంకటేశ్వర్లు, గౌరవాధ్యక్షులు బి సుధాకర్, ఆర్థిక కార్యదర్శి ఎం విజయ కుమార్, జిల్లా ఆడిట్ మెంబర్ యు దస్తగిరి, సీనియర్ ఉపాధ్యాయులు మల్లికార్జున, కే గోపాల్ పాల్గొన్నారు.

ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

- సద్వినియోగం చేసుకోండి : పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి అన్నారు. కొలిమిగుండ్లలోని క్రాసింగ్‌లో పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా సమితి అధ్యక్షులు పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి బుధవారం ప్రారంభించారు. వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి భార్య లక్ష్మీదేవి, అడ్వకేట్ ఎం ఈ తిమ్మారెడ్డి, మహేంద్ర ట్రాక్టర్ డీలర్ భాచం నాగేశ్వర్ రెడ్డి, విఆర్ వెంకటేశ్వర్ రెడ్డి, విఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వర్ రెడ్డి, పోరెడ్డి కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి జ్ఞాపకార్థంగా సేవా సమితి ద్వారా పేద పిల్లలకు, తల్లిదండ్రులు లేని పిల్లలకు చదువు కోసం ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. మండల పరిధిలోని గ్రామాలలో తమ సేవా సమితి ద్వారా స్మశాన వాటికలు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. వీటితోపాటు నిరుద్యోగ యువతకు జాబ్ మేళా తోపాటు ఏర్పాటు చేస్తామని సేవా సమితి ద్వారా మరికొన్ని కార్యక్రమాలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పోతిరెడ్డి కుటుంబ సభ్యులు పోరెడ్డి మనోహర్ రెడ్డి, బెజ్జం భాస్కర్ రెడ్డి, కామినేని కృష్ణ రంగారెడ్డి, కోటపాడు వెంకటేశ్వర్లు, కామినేని భాస్కర్ రెడ్డి, రమణమ్మ, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



ఉచిత కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు

వడదెబ్బతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

కొలిమిగుండ్లకు చెందిన బలిపి చంద్ర (30) వడదెబ్బ తగిలి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు... కొలిమిగుండ్లలో నివసిస్తున్న బలిపి చంద్ర మంగళవారం నాపరాయి గనిలో పనిచేస్తుండగా ఎండ వేడిమి కారణంగా అస్వస్థతకు గురయ్యాడు. బుధవారం తెల్లవారు జామున 4 గంటలకు కోలుకోలే మృతి చెందినట్లు ఆయన తల్లి బలిపి లక్ష్మీదేవి తెలిపారు. విషయం తెలిసిన ఎంపిడిఒ సుబ్బరాజు, సర్పంచి జినుగు శివరాముడు, ఎంపిటిసి తలారి వెంకట రమణ, నాయకులు పేరం నంద కిషోర్ రెడ్డి, పేరం నాగేంద్ర కుమార్ రెడ్డి మృతుడి ఇంటి వద్దకు చేరుకుని పరిశీలించారు. వైఎస్ఆర్ భీమా పథకం కింద అంత్యక్రియలకు తక్షణ సహాయం రూ. 10 వేలు నగదును అందజేశారు. వారి వెంట అదనపు కార్యక్రమ అధికారి గంగన్న, పంచాయతీ సెక్రటరీ భాస్కర్ రావు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు ఇజ్రాయిల్ ఈశ్వర్ నాయక్, వాలంటీర్ శిరీష ఉన్నారు.

కస్తూర్బాలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ తరగతుల్లో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బిపిఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థి ఆధార్, స్టడీ అందులో పుట్టిన తేదీ , తల్లిదండ్రుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, 5వ తరగతి, 10వ తరగతి సర్టిఫికెట్లు, విద్యార్థి ఫోటోలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి - చాగలమర్రి : ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు బుధవారం ముగిశాయి. చాగలమర్రి పట్టణంలోని వాసవి జూనియర్ కళాశాలలో చివరి పరీక్షకు 374 మంది విద్యార్థులకు గాను 343 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారని పరీక్షల చీఫ్ రమణాకుమారి, డిపార్ట్‌మెంటల్ అధికారి మురళి, ప్రిన్సిపాల్ శివరామి రెడ్డిలు తెలిపారు. పరీక్ష కేంద్రాన్ని స్క్వాడ్ అధికారి రఘునాథరెడ్డి తనిఖీ చేశారు. పరీక్షలు చివరి రోజు కావడవంతో విద్యార్థులు బయటకు వచ్చిన కేరింతలు వేస్తూ ఇళ్లకు వెళ్లిపోయారు.



కేరింతలు కొడుతున్న ఇంటర్ విద్యార్థులు

భూసార పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - పాములపాడు : రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని, ఫలితాలను అనుసరించి వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందాలని జిల్లా వనరుల కేంద్రం ఏవో హేమలత అన్నారు. బుధవారం మండలంలోని మిట్ట కందాల గ్రామంలో ఏవో ఫణీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఖరీఫ్ సీజన్‌కు రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలను అనుసరించి సూక్ష్మ పోషకాల లోపాలను అధిగమించాలన్నారు.

శ్రీశైలం దేవస్థానానికి రూ.16 లక్షలు విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల దేవస్థానానికి రూ.16 లక్షలు దాతలు విరాళంగా అందజేసినట్లు దేవస్థానం అధికారులు బుధవారం తెలిపారు. విరాళాలు అందజేసిన వారిలో తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూల్‌కు చెందిన వర్ధన్ రెడ్డి అన్న ప్రసాద వితరణ పథకానికి రూ. 1 లక్ష, గుంటూరుకు చెందిన గంధర్ల బ్రహ్మానందం కుటుంబ సభ్యులు ఉదయలక్ష్మి, సాయి సౌజన్య, పనిగలపాటి శశిధర్ వారి పేర్ల మీదుగా్న గణేష్ సదంలో ఒక గదికి రూ.15 లక్షలు కుటీర నిర్మాణ పథకం కింద దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి రామకృష్ణకు అందజేశారు. దాతలకు శేష వస్త్రాలను, ప్రసాదాలను దేవస్థానం అధికారులు అందజేశారు.

సామాజిక తనిఖీపై బహిరంగ సభ

ప్రజాశక్తి - శిరివెళ్ల : మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో 2021-2022 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులపై సామాజి తనిఖీ బహిరంగ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. గత 10 రోజుల నుండి నిర్వహించిన 16వ విడత సామజిక తనిఖీకి బహిరంగ సభలో చర్చించారు. కార్యక్రమంలో వాటర్ షెడ్ అడిషనల్ పిడి సలీం భాషా, ఏపిడి బాలాజీ నాయక్, డిఆర్‌డిఎ డిపిఎం సరస్వతి, మండల అధికారులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్ : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఏ.కోడూరు గ్రామంలోని పశు వైద్య శాల ఆవరణంలో డాక్టర్ గౌసియా బేగం మరియు పశువైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నేడు లేగ దూడల ప్రదర్శన నిర్వహించనున్నారు. అలాగే బండి ఆత్మకూర్ పశువైద్యశాల పరిధిలోని సాయిబాబా గుడి ఆవరణంలో ఉదయం 9 గంటలకు పశు వైద్యాధికారి డాక్టర్ అనూష, వైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగే లేగ దూడల ప్రదర్శనలో రైతులు పాల్గొని అత్యంత ఉత్తమ లేగ దూడను ఎంపిక చేసి బహుమతులు పొందవచ్చని పశు వైద్యాధికారి అనూష తెలిపారు.

హుండీ కానుకలు లెక్కింపు

ప్రజాశక్తి - మహానంది : మహానంది పుణ్యక్షేత్రంలో ఉభయ దేవాలయముల హుండీలలో భక్తులు చెల్లించుకున్న కానుకలను బుధవారం ఆలయంలోని అభిషేక మండపంలో ఈవో చంద్రశేఖర్ రెడ్డి, పాలకమండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో లెక్కింపు చేపట్టారు. ఈవో మాట్లాడుతూ 29 రోజులకు గాను ఆలయానికి 23 లక్షల 53 వేల 504 రూపాయలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ తరపున ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, మహానంది ఆలయ అధికారులు, సిబ్బంది, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి డ్యాన్స్ పోటీల్లో విజేత తుగ్గలి టీమ్

ప్రజాశక్తి - బేతంచెర్ల

బేతంచెర్లలోని శ్రీ శేషారెడ్డి హైస్కూల్‌లో డిజె మధు డాన్స్ స్టూడియో మొదటి వార్షికోత్సవ సందర్భంగా బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీల్లో తుగ్గలి టీమ్ విజేతగా నిలిచింది. రెండవ స్థానంలో కర్ణాటక రాష్ట్రం బళ్లారి టీం, తెలంగాణ రాష్ట్రం వనపర్తి టీం నిలిచాయి. విజేతలకు డి15 మాస్టర్ సోమేశ్ బహుమతులు అందజేశారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలో ముత్యాల సునీల్ భార్య గిరిజా రెడ్డి (23) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. పత్తికొండకు చెందిన గిరిజ రెడ్డి అదే మండలం చందోలు గ్రామానికి చెందిన ముత్యాల సునీల్ కులాంతర వివాహం చేసుకున్నారు. అక్కడ ఉపాధి లేకపోవడంతో బేతంచర్ల మండలం సిమెంటు నగర్ గ్రామానికి వచ్చి కాపురం పెట్టారు. సిమెంట్ నగర్‌లో సెక్యూరిటీ గార్డుగా ముత్యాల సునీల్ పని చేస్తున్నాడు. యధావిధిగా మంగళవారం రాత్రి సునీల్ డ్యూటీకి వెళ్ళాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా భార్య గిరిజా రెడ్డి మృతి చెంది పడి ఉండడానికి చూసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రామాలయాలు ముస్తాబు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఉయ్యాలవాడ మండలంలోని అన్ని గ్రామాలలో శ్రీరామనవమి పండుగ గురువారం ఘనంగా జరుపుకునేందుకు దేవాలయాలు విద్యుత్ దీపాలతో ఘనంగా ముస్తాబు చేశారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

(5వ పేజీ తరువాయి..) సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌లు మాట్లాడారు. **ప్యాపిలి :** చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ ప్యాపిలి, జలదుర్గంలోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాలలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రహిమాన్, పాలెం శ్రీనివాసులు, ఇలియాజ్‌లు కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. గుర్రప్ప, మనోహర్, రామాంజనేయులు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు. **మహానంది :** చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు, వ్యకాసం, రైతు సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని తమ్మడపల్లె, బుక్కాపురం, తిమ్మాపురం, మహానంది, గాజుల పల్లె గ్రామాల్లో జీపు జాతా చేపట్టారు. కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి బి బాల వెంకట్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.మార్కు, సిఐటియు మండల కార్యదర్శి కే సోమన్న, ఆశ యూనియన్ జిల్లా నాయకురాలు భారతి మాట్లాడారు. సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.


మహానంది మండలంలో మాట్లాడుతున్న నాయకులు


పాములపాడులో పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

అభ్యుదయ రచనలకు ఆహ్వానం : అరసం

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల జిల్లా అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఆధ్వర్యంలో ఏప్రిల్ 20న శ్రీశ్రీ జయంతి సందర్భంగా 'ప్రస్తుత సమాజం - తీరుతెన్నులు'ను దృష్టిలో పెట్టుకుని అభ్యుదయ రచనలను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ముర్తుజా బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రేమ కవితలు, అశ్లీలతలకు తావు లేదని, అభ్యుదయ కవితలను మాత్రమే రెండేసి కాపీలను ప్రతి రచయిత పోటీకి పంపాలని, ఏప్రిల్ 20వ తేదీలోగా యస్. ముర్తుజా, రచయిత, అరసం నంద్యాల జిల్లా కన్వీనర్, ఎస్‌వి గ్రీన్ అవెన్యూ అపార్ట్మెంట్స్, ఫ్లాట్ నెంబర్ : 117, బ్లాక్-ఎ2, జొహరాపురం రోడ్డు, కర్నూలు, కర్నూలు జిల్లా చిరునామాకు పంపించాలన్నారు. హామీ పత్రం తప్పనిసరిగా జత చేయాలని, హామీ పత్రం పైన మాత్రమే రచయిత పేరు, చిరునామా ఉండాలన్నారు. ఐదుగురు ఉత్తమ రచయితలకు ఏప్రిల్ 30 శ్రీశ్రీ జయంతి రోజు సత్కారం ఉంటుందని, విజేతల పేర్లు ఆ రోజే ప్రకటింపబడతాయని, రచయితలందరూ నాడు హాజరై తమ రచనలను వేదికపై చదివి వినిపించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9182494360 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.


ర్యాంకర్ సాత్రి ప్రమోద్‌ను అభినందిస్తున్న చల్లా శ్రీలక్ష్మి

గేట్ ర్యాంకర్‌కు చల్లా శ్రీలక్ష్మి అభినందన

ప్రజాశక్తి - అవుకు : జాతీయస్థాయిలో జరిగిన గేట్ 2023 పరీక్ష ఫలితాల్లో 384 ర్యాంకు సాధించిన అవుకు పట్టణానికి చెందిన సాత్రి ప్రమోద్ కుమార్‌ను జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమోద్ కుమార్ చిన్నతనం నుండి విద్య పట్ల ఎంతో ఆసక్తి చూపి గేట్లో ర్యాంక్ సాధించటం వాళ్ళ కుటుంబానికి గర్వకారణమన్నారు. అనంతరం ప్రమోద్ కుమార్ తల్లిదండ్రులైన సాత్రి రామయ్య, అనురాధలను అ భినందించారు.

ప్రజల అవసరాలు తీర్చడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం : సిపిఐ

ప్రజాశక్తి - పగిడ్యాల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో ఘోరంగా వైఫల్యం చెందాయని సిపిఐ మండల కార్యదర్శి మజీద్ విమర్శించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని నిరుపేద ప్రజలకు కనీసం వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక బహిర్భూమికి వెళ్లి విషపురుగు కాటుకు గురై ప్రాణలు పోగొట్టుకుంటునానరని మండిపడ్డారు. నిరుపేదలు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వాలు రూ.50 వేలు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహశీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఇస్మాయిల్, షఫి, మస్తాన్‌బాష, అబ్దుల్ రహిమాన్, చిన్న సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల : పదో తరగతి విద్యార్థులు పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని రామ్ కో సిమెంటు ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు ఆకాంక్షించారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్‌లో సరస్వతి పూజ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ చంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామ్ కో సిమెంటు ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు, మేనేజర్ హెచ్ఆర్ రవికుమార్ హాజరయ్యారు. విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలకు అవసరమయ్యే సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా రెడ్డినాగరాజు మాట్లాడుతూ మండలంలో ప్రథమస్థానం సాధించిన విద్యార్థులకు మరిన్ని ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాముడు, శివలింగారెడ్డి, మధుసూదన్, ప్రసాద్, ప్రశాంతి, సరిత, వరలక్ష్మి, అరుణ, స్వప్న, గంగాదేవి, ఇతర అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రజాశక్తి - రుద్రవరం

పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంపిడిఓ మధుసూదనరెడ్డి నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని హరి నగరం, ఆర్ నాగులవరం గ్రామంలో పాఠశాలను, నాడు-నేడు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. పంచాయితీ కార్యదర్శులు ఆదిలక్ష్మి, శివకృష్ణ, ఓబులేసు, వైసీపీ నాయకుడు నాగ ముని, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రిలోని 5వ రేషన్ షాపు పరధిలో ఎండియూ సహాయకుడుగా విధులు నిర్వహిస్తున్న రంగస్వామి విధుల్లో గుండె పోటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. నంద్యాల జిల్లా ఎండియూ ఆపరేటర్లు, చాగలమర్రి పట్టణ రేషన్ డీలర్లు కలసి చందాలు వేసుకొని రూ.21 వేలు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని బుధవారం అందజేసారు. కార్యక్రమంలో మండల ఎండియూ ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు మహబూబ్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి రమేష్, గోపాల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దాహార్తి తీర్చడమే లక్ష్యం

ప్రజాశక్తి - ఆత్మకూరు : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడమే తమ లక్ష్యమని కొత్తపల్లి మాజీ మండల ఉపాధ్యక్షులు మహబూబ్ బాషా తెలిపారు. బుధవారం కొత్తపల్లి మండలంలోని ముసలమడుగు గ్రామంలో సర్పంచ్ జమీలాబి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఎంపీడీవో మేరీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవిలోలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం బస్టాండ్ సెంటర్లో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎర్రమఠం ఎంపిటిసి ముబీనా బేగం, పంచాయతీ కార్యదర్శి షేయిన్‌షా, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు పాల్గొన్నారు.

రజకులను ఎస్‌సిలుగా గుర్తిస్తూ బిల్లు ప్రవేశ పెట్టాలి

- ఏపి రజక ఎస్‌సి సాధన చైతన్య సమితి

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : రజకులను ఎస్‌సిలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టాలని ఎపి రజక ఎస్సీ చైతన్య సాధన సమితి' రాష్ట్ర అధ్యక్షుడు నందవరం శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వెనుక నిశాంతి భవన్ ఆవరణలో ఎపి రజక ఎస్‌సి సాధన చైతన్య సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటినుండి రజకులకు ఎటువంటి ప్రత్యామ్నాయ అభివృద్ధి లేక సమాజంలో ఎన్నో అవమానాలు, అవరోధాలు ఎదుర్కొంటున్న దుస్థితి ఉందన్నారు. రజకులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రజక విద్యార్థి యువజన రాష్ట్ర అధ్యక్షులు డి.చిన్న, జిల్లా నాయకులు చిన్న శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకట రమణ, బయటిపేట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకురాలు మృతి

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సంతాపం

ప్రజాశక్తి - చాగలమర్రి : మండలంలోని చిన్నబోధనం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకురాలు బోయపాటి పెద్దక్క(65) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ గ్రామానికి చేరుకొని ఆమె మృత దేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బోయపాటి పెద్దక్క మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో లుక్కాని ఓబులేసు, ఐ టిడిపి నియోజకవర్గ ఉపాధ్యక్షురాలు శగ్నారెడ్డి, బోయపాటి శ్రీనివాసులు, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.


నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

నంద్యాల అభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఏకైక కుటుంబం శిల్పా కుటుంబమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. బుధవారం నంద్యాల మండలం పాండు రంగాపురం గ్రామంలో 85వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎర్రబోలు పురుషోత్తం రెడ్డి, ఎంపిడిఓ భాస్కర్, సర్పంచ్ డోలవతి, ఎంపిటిసి బసవ సుబ్బారెడ్డి, నంద్యాల మండల కన్వీనర్ బసవేశ్వర రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

3న వైఎస్సార్ ఆసరా కార్యక్రమం : ఎపిఎం

ప్రజాశక్తి - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాల పొదుపు మహిళలకు ఏప్రిల్ 3న సిరివెళ్ల షాది ఖానాలో వైఎస్ఆర్ ఆసరా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపిఎం పుణ్యవతి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మండల పరిధిలోని 972 పొదుపు సంఘాలకు రూ.8 కోట్ల 31 లక్షల 63 వేల 492 విడుదల కానున్నట్లు చెప్పారు. అక్కాచెల్లెళ్ల బ్యాంక్ ఖాతాలలో రాష్ట్ర ప్రభుత్వం నేరుగా జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల విజయేంద్ర రెడ్డి హాజరవుతారని తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఎల్లావత్తుల గ్రామంలో మహేష్ (35) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. మహేష్ భార్య గత కొంతకాలం క్రితం మతి చెందింది. అప్పటి నుంచి ఆవేదనతో ఉన్న మహేష్ ఇంటిలో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి కుమార్తెలు హిరణ్య, స్వప్న, కుమారుడు ఈశ్వర్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

హల్వి లో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి-కౌతాళం


కౌతాళం పోలీస్ స్టేషన్ పరిధిలో హల్వి గ్రామంలో ఓ వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి హత్య చేసిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... హల్వి గ్రామానికి చెందిన హుస్సేన్ బాష(37) అలియాస్ ఉష అనే వ్యక్తి రాత్రి భోజనం అనంతరం వాకింగుకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని పాల డెయిరి నుండి తిరిగి వస్తుండగా వల్లూరు క్రాస్ రోడ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు బైక్ పై వచ్చి మారణాయుధులతో దాడికి పాల్పడ్డారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న హుస్సేన్ బాషను108 ద్వారా ఆదోని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లే లోగానే మృతిచెందాడు. హుస్సేన్ బాష కౌతాళం బ్రాందీ షాప్ లో సూపర్వైజర్ గా పనిచేసేవాడు. హత్యకు దారి చేసిన సంఘటన వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఆత్మకూర్

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంతోనే సంక్షేమానికి నాంది పలికిందని శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ వంగాల శివ రామిరెడ్డి, ప్రముఖ న్యాయవాది కంచర్ల గోవింద రెడ్డిలు అన్నారు. బుధవారం టిడిపి 41వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆత్మకూరులోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు, అనంతరం జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివ ప్రసాద్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి నాఫూర్, జిల్లా అధ్యక్షులు సి.కలిముల్లా, లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి రాజు, బిసి సెల్ రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. **గడివేముల :** గడివేములలో టిడిపి మండల కన్వీనర్ దేశం సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి కేకును కట్ చేశారు. నాయకులు అంగజాల కృష్ణ యాదవ్, శ్రీనివాస యాదవ్, జయంత్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ఫరూక్, హర్షవర్ధన్, ఉండుట సర్పంచ్ గంగాధర్ రెడ్డి, మీడియా కోఆర్డినేటర్ సుభద్రమ్మ, వడ్డు లక్ష్మీదేవి, రాజమల్లు శ్రీనివాసులు, కంది నాగరాజు, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, గఫూర్, రంగస్వామి నాయక్, ఐ టిడిపి నియోజకవర్గ వైస్ ప్రెసిడెంట్ రాజు, బాబు నాయక్ పాల్గొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశాల మేరకు సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధన్ రెడ్డి సోదరుడు బిసి రామనాథరెడ్డి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. మిఠాయిలను పంపిణీ చేసి వేడుకలను జరుపుకున్నారు. టిడిపి వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, బిసి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దరాజుపాలెం భూషన్న, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, తెలుగు యువత నాయకులు కాట్రెడ్డి మల్లికార్జున రెడ్డి, పాతపాడు, మిట్టపల్లె సర్పంచులు బెడదల మహేశ్వరరెడ్డి, తులసి రెడ్డి, పట్టణ ఉపసర్పంచ్ పురానుద్దీన్, పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, తెలుగు యువత ప్రధాన కార్యదర్శి పవన్ కుమార్ రెడ్డి, నాయకులు అన్వర్ సాహెబ్, పుల్లారెడ్డి ,ఖాదర్ బాషా, పసుపల బాల నాయుడు, వార్డు మెంబర్ కలాం అల్తాఫ్ హుస్సేన్, విష్ణువర్ధన్ రెడ్డి, శంకేశ్వర రెడ్డి పాల్గొన్నారు. **చాగలమర్రి :** స్థానిక మెయిన్ బజార్‌లోని టిడిపి కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షులు ఎంఎస్ అన్సర్ భాష ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మైనార్టీ సెల్ జిల్లా నాయకులు కొలిమి హుస్సేన్ వల్లి, బిసి సెల్ స్పోక్ పర్సన్ సల్లా నాగరాజు, టిఎన్‌టియు సి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి నరసింహులు, తెలుగు యువత అధ్యక్షులు మద్దూరు మాబులాల్, మండల ప్రచార కార్యదర్శి ముల్లా గఫార్, ప్రధాన కార్యదర్శి హనీఫ్, ఎంఎస్ అజీముద్దీన్, నాయకులు ముల్లా అజీమ్, బషీర్, రామిశెట్టి, రమేష్, మధు, శంకర సుబ్బారావు, నాగూర్ భాష, ఓబులేష్, కాజా రసూల్, వీరం రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగ శేషు, కాజా, ఖలీల్ గారి షరీఫ్ పాల్గొన్నారు. **కోవెలకుంట్ల :** పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లులర్పించారు. పార్టీ జెండాను ఎగరేసి స్వీట్లు పంపిణీ చేశారు. మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ గడ్డం నాగేశ్వర్ రెడ్డి, అమడాల మద్దిలేటి, వల్లంపాడు సర్పంచి జగదీశ్వర్ రెడ్డి, రాజశేఖర్, బిజినవేముల డి హుస్సేనయ్య కులాయి, దస్తగిరి పాల్గొన్నారు. **ప్యాపిలి :** ప్యాపిలిలోని పార్టీ కార్యాలయంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. టిడిపి కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు రాఘవేంద్ర, వెంకటేశ్వర్ రెడ్డి, రామ్మోహన్ యాదవ్, సుంకయ్య, పెద్ద రామాంజనేయులు, సుదర్శన్, నాగేంద్ర, ప్రసాద్ రెడ్డి, మల్లికార్జున, కోదండ, గోపాల్ రెడ్డి, బ్యాంకు శీను, వెంకట్రాముడు, ఆర్సి మద్దిలేటి పాల్గొన్నారు. **పగిడ్యాల :** పగిడ్యాల మండలంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లుర్పించారు. మండల కన్వీనర్ పలుచాని మహేశ్వరరెడ్డి, నాయకులు పగడం శేఖర్, నరసింహారెడ్డి, ధర్మారెడ్డి, పాలమర్రి నాగరాజు పాల్గొన్నారు. **బండి ఆత్మకూర్ :** స్థానిక బస్టాండులోని ఎన్టీఆర్ విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షుడు నందిపాటి నరసింహారెడ్డి పూలమాలలు వేసి అనంతరం కేక్ కట్ చేశారు. సీనియర్ నాయకులు మనోహర్ చౌదరి, తాటికొండ బుగ్గ రాముడు, చలమయ్య, సర్పంచులు పెద్దినేని పెద్దన్న, ఎలగల రామచంద్రుడు, క్లస్టర్ అధ్యక్షుడు జిసి పాలెం చిన్న లింగారెడ్డి, జాలనందయ్య, జాకీర్ ఖాన్, తోట శివయ్య పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** ఉయ్యాలవాడలోని బస్టాండ్ ఆవరణంలో బుడ్డా వెంగళరెడ్డి, నరసింహారెడ్డిల సత్రం దగ్గర టిడిపి జెండాను ఆవిష్కరించారు. ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల నాయకుడు కూడాల నారాయణరెడ్డి, బోరెడ్డి నర్సిరెడ్డి, బోరెడ్డి శేఖర్ రెడ్డి, ఆకుల వెంకటసుబ్బయ్య, కుప్పం మీది వెంకటేశ్వర్లు, రూపనగుడి కర్నాటి విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు :** పాములపాడు టిడిపి నందికొట్కూరు నియోజకవర్గ అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి, మండల అధ్యక్షులు చెల్లె హరినాథ్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు మధు కృష్ణ మండల నాయకులతో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. నాయకులు శివ శంకర స్వామి, పూసల కృష్ణ, హరిప్రసాద్, అర్జున్ గౌడ్, హఫీజ్, శేఖర్, రామకృష్ణ, కరీం, శివ శంకర్ స్వామి, యల్ల కృష్ణ, ఆదిరెడ్డి, రాము చౌదరి, నాగలక్ష్మి రెడ్డి, కలిముల్లా షేన్ బాషా, వీరేశ తదితరులు పాల్గొన్నారు. **బేతంచెర్ల :** బేతంచర్ల పాత బస్టాండ్‌లోని భారత్ బేకరీ సమీపంలో పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి ఆధ్వర్యంలో టిడిపి జెండా ఆవిష్కరణ చేశారు. కాకర్ల తిరుమలేష్ చౌదరి, బుగ్గన ఆనంద్ రెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాయక్, మాజీ ఎంపిటిసి జాకిర్ల బేగ్, బుగ్గాన పల్లి రమేష్, రాష్ట్ర క్రిస్టియన్ కమిటీ కార్యదర్శి లేఖల నాగరాజు, బేతంచెర్ల కౌన్సిలర్ రామాంజనేయులు, నాయకులు ఎర్రమల నాయుడు, రామ్ గోపాల్, నంద్యాల మధు, టైలర్ రాముడు, అరుణ్ కుమార్, ఫయాజ్, రాముడు, గూటం శివ, లోకేష్ గౌడ్, సెటిల్మెంట్ శెట్టి, ఆవుల రామకృష్ణ, వెంకటేష్, నాగరాజు, జనార్ధన్ పాల్గొన్నారు. **కొలిమిగుండ్ల :** స్థానిక టిడిపి కార్యాలయం ఆవరణలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి ఎంవి.శివ రామిరెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. చంద్రశేఖర్ రెడ్డి, నాగార్జున రెడ్డి, టైలర్ రాముడు, రాజగోపాల్ యాదవ్, సిఎస్.రెడ్డి, బాయికాడి బ్రదర్స్, ఇటిక్యాల శివా రెడ్డి, బిజ్జం భాస్కర్ రెడ్డి, చిన్నపురెడ్డి, బొట్టుస్వామి, రత్నమయ్య, శ్రీను, ఉసేన్ నారాయణ, ఆఫీస్ గోపాల్, కొండమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు. **నంద్యాల కలెక్టరేట్ :** నంద్యాల చామ కాలువ వద్ద ఉన్న టిడిపి కార్యాలయంలో యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. టిడిపి కౌన్సిలర్లు, ఇన్చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆత్మకూరులో..




చాగలమర్రి : నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు


పగిడ్యాలలో..


ఉయ్యాలవాడలో..


నంద్యాలలో కేక్ కట్ చేస్తున్న జగత్ విఖ్యాత్ రెడ్డి


కోవెలకుంట్లలో..

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపలు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో
OS No: 712/2019

లింగంపల్లి శ్రీనివాసులు తండ్రిం నారాయణస్వామి
ఇంటి నెం.4-267, క్రాంతినగర్, రైతునగర్ పంచాయతీ,
నంద్యాల మండలం, నంద్యాల జిల్లా.
...వాది

Vs.

సాదు వెంకట సుబ్బారెడ్డి తండ్రి వెంకటసుబ్బారెడ్డి
నియర్ నాగ సాయి పబ్లిక్ స్కూల్, క్రాంతినగర్,
రైతునగర్ పంచాయతీ, నంద్యాల మండలం, నంద్యాల జిల్లా.
......ప్రతివాది

ప్రతివాదికి సమన్లు

యీ నెంబరు దావా వాది ప్రతివాదిపైన ప్రాంసరి నోటు బాకీ రాగోరి దావా మొత్తం రూ.1,70,000/- రాబట్టు కొన నిమిత్తం పై దావా దాఖలు చేయగా కోర్టు ద్వారా ప్రతివాది అయిన నీకు కోర్టు ద్వారా, పోస్టు ద్వారా దావా సమను పంపిన ముట్ట నందున సదరు దావా పైన ప్రతివాది అయిన నీకు ఏదైన ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టు వారి ఎదుట 13-4-2023 తేదిన పగలు 10-30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలెను. అట్లు రానంతట మీ పరోక్షమందు తీర్మానింతురు.

(కోర్టు వారి వుత్తర్వుమేరకు)

దావా సమన్ వాయిదా తేది : 13-04-2023

ఇట్లు
శ్రీ పి.వి.రమణ,
వాది తరపు అడ్వకేటు, నంద్యాల.

U/section 5 Indian Limitation Act Notice
మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపలు సీనియర్ సివిల్ జడ్జికోర్టులో
I.A.No.490/2022 in OS 01/2013

కె.రాజశేఖర్ తండ్రి లేట్ సుబ్బారావు,
రైతునగర్, ప్రస్తుతం ప్లాటు నెం.502,
వై.వి.ఎస్.నాగబాల రెసిడెన్సీ,
మహాత్మగాంధీ ఇన్నరింగ్ రోడ్డు, రెడ్డిపాల్లెం,
అగర్తవరపాడు, గుంటూరు - 522509.
...అర్జీదారు(3వ ప్రతివాది

Vs.

1) శేగు వెంకట నాగపుల్లయ్య (వాది)
2) కంభంపాటి సుబ్బారావు Died by Lrs (D1)
3) కంభంపాటి రత్నకుమారి (D2)
4) కె.చరన్ తేజ తండ్రి లేట్ సుబ్బారావు,
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ (biomathematics)
ప్రస్తుతం రైతునగర్, శ్రీ సుబ్రమణేశ్వర స్వామి రైసమిల్,
నంద్యాల, నంద్యాల జిల్లా. (D4)
...రెస్పాండెంట్లు

పై నెంబరు అర్జీని 3వ ప్రతివాది/అర్జీదారు తనపైన పాలించిన ఎక్స్‌పార్టీ డిక్రీని రద్దుకోరి సకాలములో దాఖలు చేయక జరిగిన ఆలస్యమును మన్నించుటకుగాను, సెక్షన్ 5 లిమిటేషన్ అక్టు క్రింద అర్జీదాఖలు చేయగా (D4) R4 అయిన నీకు ఏదైన ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు వారి ఎదుట 18-04-2023 తేదిన పగలు 10.30 గంటలకు హాజరై తెలుపుకొనవలెను. అట్లు రానంతట నీపరోక్షమందు తీర్మానింతురు.

(కోర్టు వారి వుత్తర్వుమేరకు)

వాయిదా తేది : 18-04-2023

ఇట్లు
శ్రీ పి.వి.రమణ,
అర్జీదారు / (D3) తరపు అడ్వకేటు,
నంద్యాల.

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపలు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో
OS No: 1133/2019

లింగంపల్లి శ్రీనివాసులు తండ్రిం నారాయణస్వామి
ఇంటి నెం.4-267, క్రాంతినగర్, రైతునగర్ పంచాయతీ,
నంద్యాల మండలం, నంద్యాల జిల్లా.
...వాది

Vs.

సాదు వెంకట సుబ్బారెడ్డి @ పెద్ద వెంకట సుబ్బారెడ్డి
తండ్రి సుబ్బారెడ్డి, ఇంటి నెం.4-119,
నియర్ నాగ సాయి పబ్లిక్ స్కూల్, క్రాంతినగర్,
నంద్యాల, నంద్యాల జిల్లా. ...ప్రతివాది

ప్రతివాదికి సమన్లు

యీ నెంబరు దావా వాది ప్రతివాదిపైన ప్రాంసరి నోటు బాకీ రాగోరి దావా మొత్తం రూ.2,58,000/-లు రాగోరి దావా దాఖలు చేయగా ప్రతివాది అయిన నీకు కోర్టు వారు కోర్టు ద్వారా, పోస్టు ద్వారా దావా సమన్స్ పంపిన ముట్ట నందున కోర్టు వారు ఇందు మూలముగా ప్రతివాది అయిన నీకు దావా పైన ఏదైన ఆక్షేపణలు వున్న ఎడల పై కోర్టు వారి ఎదుట 13-4-2023 తేదిన పగలు 10-30 గంటలకు హాజరై తెలుపుకొనవలెను. అట్లు రానంతట మీ పరోక్షమందు తీర్మానింతురు.

(కోర్టు వారి వుత్తర్వుమేరకు)

దావా సమన్ వాయిదా తేది : 13-04-2023

ఇట్లు
శ్రీ పి.వి.రమణ,
వాది తరపు అడ్వకేటు, నంద్యాల.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ నంద్యాల జడ్జి కోర్టు : నంద్యాల
I.A.No. 148/2021
IN
O.S.NO. 721/2021

M. సుకుమార్. ...వాది/పిటిషనర్

వర్సెస్

కంబపు మాధవ చినపోయినందున అతని వారసులు,
K.చంద్రావతి మరియు ఇతరులు
D4 K.సౌజన్య, వయసు.36.సం॥, తండ్రి. లేట్ K.మాదవ,
H.no.28-816.c1, N.G.O'S.కాలనీ, బ్రహ్మారెడ్డి టవరు దగ్గర,
నంద్యాల టౌన్, నంద్యాల జిల్లా.
...ప్రతివాది/రెస్పాండెంట్

4వ ప్రతివాదికి దావా నోటీసు

పై నెంబర్ దావాయందు వాది /పిటిషనర్ కు 4వ ప్రతివాది/ రెస్పాండెంట్ అయినా నీ నుండి బాకీ మొత్తం రాగొరి 4వ ప్రతివాది అయినా నీ పైన అటాచ్మెంట్ కోరి దావా దాఖలు చేసి ఉంటున్నరు. 4వ ప్రతివాది/ రెస్పాండెంట్ అయిన నీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా నోటీసులు పంపినా తీసుకొనందున పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని 03-04-2023 వ తేదీ ఉదయం10-30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకుకొన వలయును లేని ఎడల మీ పరోక్ష మందు తీర్మానించుదురని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ: 03-04-2023

గొల్ల మద్దులేటి,
వాది/పిటిషనర్ పరము అడ్వకేట్,
నంద్యాల జిల్లా,
Cell : 9030330002.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ జూనియర్ నంద్యాల జడ్జి కోర్టు. నంద్యాల
O.S.NO. 721/2021

M.సుకుమార్. ...వాది

వర్సెస్

కంబపు మాధవ చినపోయినందున అతని వారసులు,
K.చంద్రావతి మరియు ఇతరులు
R4. K. సౌజన్య, వయసు.36.సం॥, తండ్రి. లేట్ K.మాదవ,
H.no.28-816.c1, N.G.O'S.కాలనీ,
బ్రహ్మారెడ్డి టవరు దగ్గర, నంద్యాల టౌన్, నంద్యాల జిల్లా.
...ప్రతివాది

4వ ప్రతివాదికి దావా సమన్లు

పై నెంబర్ దావాయందు వాది కి 4వ ప్రతివాది అయినా నీ నుండి బాకీ మొత్తం రాగొరి 4వ ప్రతివాది అయినా నీ పైన దావా దాఖలు చేసి ఉంటున్నరు. 4వ ప్రతివాది అయిన నీకు కోర్టు ద్వారా పోస్టు ద్వారా నోటీసులు పంపినా తీసుకొనందున పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, వకీలు ద్వారా గాని 03-04-2023 వ తేదీ ఉదయం10-30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకుకొన వలయును లేని ఎడల మీ పరోక్ష మందు తీర్మానించుదురని తెలియజేయడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

వాయిదా తేదీ: 03-04-2023

గొల్ల మద్దులేటి,
వాది పరము అడ్వకేట్
నంద్యాల జిల్లా,
Cell : 9030330002.